

నేడు రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు లాటరీ 5లో..

సాఫ్ట్‌వేర్ కోర్సులకు ఉచిత శిక్షణ

పత్తి రైతులకు ప్రభుత్వం శుభవార్త

ఎక్కడైనా పంట అమ్ముకునే అవకాశం

రేషన్ అక్రమ రవాణాకు రెడ్ సిగ్నల్

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు ప్రభుత్వం 'రెడ్' సిగ్నల్ వేసింది. నల్లబజారుకు తరలే పేదల బియ్యాన్ని 'రెడ్'హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు చర్యలు తీసుకుంది. ఇందుకు ప్రత్యేక పరీక్ష కిట్లను పౌరసరఫరాల శాఖకు అందజేసింది. జిల్లాల వారీగా వీటిని పంపిణీ చేసింది. అక్రమార్కులపై అక్కడికక్కడే 6ఏ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో సాధారణ బియ్యం మాటున జరిగే.. చౌక బియ్యం అసలు 'రంగు' తేలికగా తేలనుంది.

- స్పాట్‌లోనే పేదల బియ్యం గుర్తింపు
- పరీక్షలకు పౌరసరఫరాల శాఖకు ప్రత్యేక కిట్లు
- జిల్లాలకు ఇప్పటికే పంపించిన ప్రభుత్వం
- నల్లబజారు వ్యాపారులకు ఇక 'రంగు' పడనుంది..!





పీడీఎస్ బియ్యం నిర్ధారించే కిట్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పేదలకు బలవర్థక బియ్యం (ఫోర్టిఫైడ్ రైస్)ను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. పోషక విలువలు పెంచేందుకు కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలపడాన్నే ఫోర్టిఫైడ్ బియ్యం అంటారు. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందించే చౌక బియ్యాన్ని.. అక్రమార్కులు నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ బియ్యం నిల్వలు పట్టుబడినా.. అక్కడికక్కడే వాటిని నిర్ధారించే పరిస్థితి గతంలో లేదు. కానీ, ఇక నుంచి లెక్క వేరేలా ఉండనుంది. నల్లబజారులో పేదల బియ్యాన్ని స్పాట్‌లోనే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవచ్చు. ఇందుకు ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్(ఎఫ్ఆర్‌కే) ఐరన్ స్పాట్ టెస్ట్ కిట్‌లను జిల్లాకు 7 నుంచి 10 వరకు ప్రభుత్వం అందజేసింది. వీటి ద్వారా రేషన్ బియ్యాన్ని నిర్ధారించడమే కాకుండా వెనువెంటనే 6ఏ కేసు నమోదుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ కిట్లు కాకినాడ పోర్టులో ఉండేవి. పోర్టుకు వచ్చే బియ్యం నిల్వలను కిట్ ద్వారా పరీక్షించే వారు. ఇప్పుడు ప్రతి నియోజకవర్గానికి పరీక్ష విధానాన్ని తీసుకొచ్చారు.

బియ్యం ఫోర్టిఫైడ్ ఇలా..

మార్కెట్‌లో సాధారణ బియ్యానికి.. ప్రభుత్వం అందించే చౌక బియ్యానికి చాలానే తేడా ఉంది. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యాన్ని ఫోర్టిఫైడ్ చేసి.. పేదలకు సరఫరా చేస్తోంది. ఈ బియ్యంలో పోషకాలు ఉంటాయి. ఇందులో కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలుపుతారు. ముందుగా బియ్యాన్ని పిండిగా మారుస్తారు. అందులో ఐరన్, జింక్, ఫోలిక్ యాసిడ్, బీ-12 వంటి విటమిన్లు కలుపుతారు. అనంతరం ఆ పిండిని మళ్లీ బియ్యం కెర్నెల్స్(గింజలు)గా మారుస్తారు. క్వింటా బియ్యానికి కిలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నెల్స్ కలుపుతారు. ఆహార భద్రతతో పాటు పౌష్టికాహార లోపం కూడా ఉండకూడదన్న లక్ష్యంతో అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ప్రజా పంపిణీలో ఈ ఫోర్టిఫైడ్ బియ్యం ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. గతేడాది నుంచి ఈ విధానం పూర్తి స్థాయిలో (మిగతా 5వ పేజీలో)

ఎస్సీలకు రుణాలు



- జిల్లాల వారీగా లక్ష్యాల నిర్దేశం
- రాయితీపై యూనిట్లకు కార్యాచరణ
- కార్పొరేషన్‌ను గాడిన పెట్టే దిశగా ప్రభుత్వం

2852 యూనిట్లు.. రూ.38 కోట్ల రాయితీ

ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే యూనిట్లకు సంబంధించి జిల్లాల వారీగా ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. బాపట్ల జిల్లాలో వివిధ కేటగిరీల్లో 912 యూనిట్లు కేటాయించగా ఇప్పటికే 2,500 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. గుంటూరు జిల్లాలో 990, పల్నాడు జిల్లాలో 950 యూనిట్లకు దరఖాస్తులు ఆహ్వానించగా దాదాపు 5,000 వరకు వచ్చాయి. మూడు జిల్లాలకు ప్రభుత్వం కేటాయించిన రుణాలు రూ.95 కోట్ల వరకు ఉన్నాయి. ఇందులో రాయితీ రూ.38 కోట్లు, బ్యాంకులు అందించే రుణ సదుపాయం రూ.45 కోట్ల వరకు ఉండనుంది.



(సత్తెనపల్లి, ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో నిర్వీర్యమైన ఎస్సీ కార్పొరేషన్‌కు పూర్వవైభవం కల్పించేలా ప్రస్తుత ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరంలో అర్హులైన ఎస్సీ యువతకు రాయితీపై రుణాలు అందించడానికి కార్యాచరణ రూపొందించింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో రాయితీపై అందించే యూనిట్లకు లక్ష్యం నిర్దేశించడంతో పాటు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఎస్సీ కార్పొ రేషన్ ద్వారా రాయితీ అందించి యూనిట్లు పెట్టేలా ప్రోత్సహించేది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత మళ్లీ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు రాయితీపై యూనిట్లు అందించే కార్యక్రమానికి కసరత్తు జరుగుతుండడంపై ఎస్సీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన యూనిట్ల కంటే ఇప్పటికే మూడు రెట్లు అధికంగా దరఖాస్తులు వచ్చాయి. ఇంకా దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో త్వరలోనే మండలాల వారీగా వాటి పరిశీలన ప్రక్రియకి ఎస్సీ కార్పొరేషన్ కసరత్తు చేస్తోంది. మండల స్థాయి అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన తర్వాత అవి కలెక్టర్ లాగిన్‌కు చేరడం, అక్కడ నుంచి రాష్ట్రస్థాయికి నివేదిక తర్వాత లబ్ధిదారుల తుది ప్రకటన వెలువడనున్నది.

మూడు కేటగిరీలు..

ఎస్సీ యువతకు రాయితీపై అందించే రుణాలను మూడు కేటగిరీల్లో విభజించనున్నారు. మొదటి విభాగంలో మూడు లక్షల్లోపు, రెండో కేటగిరీలో మూడు నుంచి ఐదు లక్షల్లోపు, మూడో విభాగంలో పది లక్షల్లోపు యూనిట్లను అందించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆయా కేటగిరీల్లో ఏయే రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న దానిపై తర్జనభర్జన జరుగుతున్నట్లు సమాచారం. ఎస్సీ కార్పొరేషన్ అందించిన వివరాల ప్రకారం సాంకేతికపరమైన యూనిట్లకు ప్రాముఖ్యత ఇవ్వనున్నట్లు సమాచారం. ఇందులో ఐటీ సేవలు మొదలు వెబ్‌సైట్ రూపకల్పన వరకు ఉన్నాయి. సెల్‌ఫోన్ రిపేర్ షాపులు, స్టేషనరి తయారీ, సోప్స్‌తో పాటు సౌందర్య సాధనాల తయారీ యూనిట్లకు రాయితీలో చోటు కల్పించనున్నారు.

బకాయిలపై ప్రత్యేక దృష్టి..

ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు జవసత్వాలు అందించడంతో పాటు గతంలో లబ్ధి పొందిన వారు బకాయిలు చెల్లించడంలో ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా పరిగణిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.36 కోట్లు బకాయిలు ఉండగా ఇందులో బాపట్ల జిల్లా వాటా రూ.8 కోట్లుగా ఉన్నట్లు సమాచారం. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కే ఎఫ్‌డీసీకి సంబంధించిన రుణాలు ఈ బకాయిల్లో ఉన్నాయి. బకాయి దారులకు గతంలోనే ఓసారి నోటీసులివ్వడం జరిగిందని, ప్రస్తుతం స్పెషల్ డ్రైవ్ జరుగుతోందని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు.



శారదాదేవి అమ్మవారికి వైష్ణవి అలంకారం

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

కొనసాగుతున్న దసరా ఉత్సవాలు

నరసరావుపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. స్థానిక పాతూరులోని శ్రీగంగాపార్వతి సమేత భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో గురువారం అమ్మవారికి అన్నపూర్ణ అలంకారం చేశారు. శ్రీశృంగేరి శంకరమఠంలో శారదాదేవికి వైష్ణవి అలంకారం చేశారు. బాలయ్యనగర్‌లోని శ్రీ కల్యాణ సుందరేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీ అమ్మవారికి కాత్యాయనీదేవి అలంకారం చేశారు. సత్తెనపల్లి రోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి వైష్ణవిదేవి అలంకారం చేశారు. పాతూరు, రామిరెడ్డిపేటలోని శ్రీచౌడేశ్వరి దేవాలయాలు, నవోదయనగర్, ప్రధాన రహదారిలోని మహాలక్ష్మీ చెట్ల వద్ద దసరా ఉత్సవాలు కనులపండువగా నిర్వహిస్తున్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు 30 వరకు గడువు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్స్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 చివరి తేదీ అని డీఈవో ఎల్ చంద్రకళ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 7న జరిగే పరీక్షకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ బీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నమోదు సమయంలో విద్యార్థుల ఆధార్‌కార్డులో ఉన్న విధంగానే పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేయాలన్నారు. ఈ పరీక్షకు ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతూ కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్న విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తుకు ఎటువంటి ధ్రువ పత్రాలు అవసరం లేదన్నారు. పరీక్ష రాసే సమయంలో అన్ని ధ్రువపత్రాలు తప్పకుండా సిద్ధం చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 ఆన్‌లైన్‌లో పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ బీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఎన్ఎంఎంఎస్‌లో ఏమైనా సందేహాలు ఉంటే శంకర్‌రాజును 9963192487 నంబరులో సంప్రదించాలన్నారు.

మురుగుకు..చెక్

- మురుగునీటి శుద్ధికి ప్లాంట్లు
- ఎస్టీపీ ప్లాంట్లకు.. రూ.38 కోట్లు
- చెక్కవాగు, ముట్లకుంట కాలనీలో నిర్మాణం

వినుకొండటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కలుషిత జలాలు పెనుముప్పుగా మారాయి. ప్రజల జీవన ప్రమాణాలు తగ్గడంతో పాటు అనారోగ్యాలతో ఆర్థికంగా నష్టపోయి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మురుగునీటి శుద్ధి కర్మాగారం(సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్-ఎస్టీపీ) నిర్మాణాలపై దృష్టి సారించింది. ఈ ప్లాంట్ల ద్వారా మురుగునీటిలో హానికరమైన వ్యాధికారకాలు, రసాయనాలు, ఇతర కలుషితాలను తొలగించి ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని రక్షించేలా ఏర్పాటు చేస్తోంది. వినుకొండలోని ముట్లకుంటకాలనీ, చెక్కవాగు రైల్వేట్రాక్ సమీపంలో ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.38 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఎస్‌బీఆర్(బేసిన్ స్వీక్వెన్సింగ్ బ్రాంచింగ్ రియాక్టర్)లోకి మురుగు నీటిని పంపించి సీసీటీ క్లోరిన్ కాంట్రాక్ట్ ట్యాంక్‌లో శుద్ధి చేసి రోజుకు 5.5 ఎంఎల్‌డీ(5 లక్ష లీటర్లు) నీటిని కాల్వలు, పైపుల ద్వారా పంట పొలాలకు అందజేసేలా నిర్మాణం చేపడుతున్నారు. చెక్కవాగు సమీపంలో నిర్మిస్తున్న ఎస్టీపీ 5.5 ఎంఎల్ కాగా, ముట్లకుంట కాలనీలో 5.5 ఎంఎల్‌డీ పరిమాణంతో నిర్మిస్తున్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ ప్లాంట్ల పనులు జరుగుతున్నాయి. బ్లోయర్ రూమ్, పీటీయూ (ప్రైమరీ ట్రీట్మెంట్ యూనిట్) వంటి కట్టడాలను నిర్మిస్తున్నారు.

ముట్లకుంటకాలనీ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఎస్టీపీ ప్లాంట్స్





నిర్మాణంలో ఉన్న పీటీయూ (ప్రైమరీ ట్రీట్మెంట్ యూనిట్)

వినుకొండకే వరం

వినుకొండలో రూ.38 కోట్లతో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు చొరవతో ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నాం. కలుషిత జలాలతో ప్రజల ఆరోగ్యం క్షీణిస్తుంది. ఈ ప్లాంట్ ద్వారా నీరు, పర్యావరణం కలుషితం కాకుండా చేయవచ్చు.

- డాక్టర్ దస్తగిరి, మున్సిపల్ చైర్మన్

విద్యారంగం నిర్వీర్యం

- బోధనేతర విధుల్లో ఉపాధ్యాయులు
- నాణ్యమైన విద్యకు విద్యార్థులు దూరం
- రాష్ట్రస్థాయి రణభేరిలో యూటీఎఫ్ నేతలు

గుంటూరు విద్య, సెప్టెంబరు 25 ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఐదేళ్లలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేయగా ఈ ప్రభుత్వం కూడా ఇదే బాటలో పయనిస్తోందని యూటీఎఫ్ నేతలు తెలిపారు. గురువారం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రణభేరిలో పలువురు నేతలు ప్రసంగించారు. విద్యారంగం, ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీగా ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన



సభలో ప్రసంగిస్తున్న ఏపీజేఏసీ రాష్ట్ర చైర్మన్ విద్యాసాగర్

జరిగిన సమావేశంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ బీ గోపిమూర్తి ప్రసంగించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ నిర్ణయాల కారణంగా పది లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారన్నారు. సమస్యలపై ఉద్యోగులు, ఉపాధ్యాయులతో ప్రభుత్వం చర్చించడంలేదని మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ బోధనేతర పనులతోనే ఉపాధ్యాయులు కాలం వెళ్లదీస్తున్నారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే అవకాశం లేకుండా పోతుందని వాపోయారు నూతనంగా ప్రవేశపెట్టిన అసెస్మెంట్ పరీక్షల విధానం అస్తవ్యస్తంగా మారిందన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కే సురేష్‌కుమార్, కుసుమకుమారి, గౌరవాధ్యక్షుడు కే శ్రీనివాసరావు, ఏపీజేఏసీ రాష్ట్ర చైర్మన్ ఏ విద్యాసాగర్, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభుదాస్, ఏపీ ఎన్జీవో ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది మేమే.. వాటా ఇవ్వాలి

- జిన్నర్లతో బయ్యర్ల రాయబేరాలు
- టెండర్లు ఖరారు కాకముందే భేటీలు
- సీసీఐ అధికారుల తీరుపై ఆరోపణలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు తొలి అడుగుపడుతుంది. టెండర్ల ప్రక్రియ ముగియక ముందే బయ్యర్ల రాయభారాలు మొదలయ్యాయి. జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. ఈ సీజన్‌కు సంబంధించి ఈ నెల 27కి టెండర్ల గడువు ముగుస్తుంది. ప్రస్తుతం కొన్ని నిబంధనల మీద జిన్నర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ ప్రక్రియ సాగుతుండగానే కొందరు బయ్యర్లు ఎక్కువ మిల్లులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. మీ మిల్లుకు వచ్చేది నేనే టెండర్ వేసుకోండి.. వచ్చిందాంట్లో ఎంతో కొంత చూద్దాం అంటూ కొందరు బయ్యర్లు రాయబేరాలు మొదలు పెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదే రీతిలో కొందరు బయ్యర్లు అధిక సంఖ్యలో జిన్నింగ్ మిషన్లు ఇప్పటికే దక్కించుకున్నారని సమాచారం. టెండర్లు ఖరారు కాకుండా ఫలానా మిల్లుకు తానే బయ్యర్‌గా వస్తానని ఎలా చెబుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్న ఓ బయ్యర్‌కు సంబంధించిన వ్యక్తి అన్ని మిల్లులకు వెళ్లి తామే వస్తామని చెప్పి ఇప్పటికే సుమారు 300 జిన్నింగ్ మిషన్లు కలిగిన మిల్లులను తన కిందకు తెచ్చుకున్నట్లు సమాచారం. సుమారు 10 మంది బయ్యర్లు ఉండగా, ఒక్కరే అన్ని మిషన్లు తన కిందకు తెచ్చుకోవడంపై చర్చ జరుగుతుంది. సాధారణంగా ఏ బయ్యర్ ఏ మిల్లులో కొనుగోలు జరపాలన్న విషయాన్ని తేల్చాల్సింది సీసీఐ అధికారులే. కొందరు బయ్యర్లు ఇప్పటికే బహిరంగంగా మిల్లులు కేటాయించిన విషయం మాట్లాడుతుండటం వెనుక ఎవరు ఉన్నారన్న ప్రశ్న కూడా వస్తోంది.

అదుపుతప్పిన కారు.. ఇద్దరి మృతి

- స్విమ్స్ వైద్యుడు, ఆయన కుమార్తె దుర్మరణం.. మరో ఐదుగురికి గాయాలు
- తిరుపతి నుంచి గుంటూరు వస్తుండగా తాతపూడి వద్ద ఘటన



వెంకటకిశోర్



అశ్వి నందన

చిలకలూరిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అతివేగం.. నిద్రమత్తు కారణంగా జరిగిన ప్రమాదంలో తండ్రి కుమార్తె మృతి చెందగా మరో ఐదుగురు గాయపడ్డారు. జాతీయ రహదారిపై చిలకలూరిపేటకు సమీపంలోని తాతపూడి వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన చోటుచేసుకుంది. చిలకలూరిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో అసోసియేట్ ప్రొఫెసరైన డాక్టర్ తంగెళ్ల కేదర వెంకటకిశోర్(42) కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తిరుపతి నుంచి స్వస్థలమైన గుంటూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో తెల్లవారుజామున మార్టూరు చిలకలూరిపేట మధ్య తాతపూడి ఫ్లై ఓవర్ వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నది. డ్రైవింగ్ చేస్తున్న డాక్టర్ కిశోర్ కారులో నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కుమార్తె అశ్వినందనను గుంటూరులోని రమేష్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. డాక్టర్ కిశోర్ భార్య డాక్టర్ అన్నా సంధ్యయాదవ్, కుమారుడు ఆయుష్‌నందన, కిశోర్‌కు వరసకు చెల్లెలు అయ్యే డాక్టర్ శ్వేత, ఆమె కుమార్తెలు అన్నా ఆధ్యా, అన్నా షైరా గాయపడగా వీరు చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం డాక్టర్ కిశోర్, అశ్వినందన మృతదేహాలను పోలీసులు బంధువులకు అప్పగించారు. రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన పల్లా

కాగా ప్రమాదం విషయం తెలిసిన వెంటనే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హుటాహుటిన సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకున్నారు. చిలకలూరిపేటలోని కందిమళ్ళ స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదానికి గురైన వారు ఆయన బంధువులని సమాచారం. పల్లాతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఫోన్‌లో మాట్లాడారు. ఘటనపై ప్రత్తిపాటి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.



ప్రమాదానికి గురైన కారు

తిన్నదానికి బిల్లు కట్టమన్నందుకు.. లారీ ఎక్కించి చంపేశాడు!

- మద్యం మత్తులో లారీ డ్రైవర్ ఘాతుకం
- దాబా యజమాని సహా మరో వ్యక్తి మృతి
- శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలంలో ఘటన



అయూబ్



దండాసి

కంచిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిన్నదానికి బిల్లు కట్టమన్నందుకు ఓ డ్రైవర్ తన లారీని పైకి ఎక్కించి ఇద్దరిని చంపేశాడు! ఈ దారుణ ఘటన శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం జలంత్రకోట సమీపంలోని దాబా హోటల్ వద్ద బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కంచిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝూర్ఖండ్‌కు చెందిన లారీ డ్రైవర్ ఇబ్రార్ ఖాన్ బుధవారం రాత్రి భోజనం చేసేందుకు దాబా హోటల్‌కు వచ్చాడు. అర్ధరాత్రి 12 గంటలకు భోజనం చేసి బిల్లు ఇవ్వకుండా వెళ్లిపోతుండగా.. దాబా యజమాని అయూబ్ (55) అడ్డుకున్నారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అప్పటికే డ్రైవరు మద్యం మత్తులో ఉన్నాడు. ఆ తర్వాత లారీ ఎక్కి నడుపుకుని వెళ్తుండగా.. ఆపేందుకు అయూబ్ ప్రయత్నించారు. అయితే డ్రైవర్ వాహనాన్ని మీదుగా నడిపించడంతో అయూబ్ అక్కడికక్కడే చనిపోయారు. ఇది గమనించిన మధుపురం గ్రామానికి చెందిన డొక్కరి దండాసి (65) లారీని ఆపేందుకు ప్రయత్నించే క్రమంలో దాని కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. అతడిని సోంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. అక్కడున్న వారు లారీని వెంబడించి బురగాం సమీపంలో పట్టుకున్నారు. పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకు కేసు నమోదు చేశారు.

జల, థర్మల్ విద్యుదుత్పత్తికి ప్రాధాన్యం

- జెన్కో ట్రాన్స్‌కో అధికారులతో సీఎస్ సమీక్ష

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాను సమర్ధవంతంగా నిర్వహించేందుకు జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను కోరారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై ఆయన గురువారం సచివాలయంలో ట్రాన్స్‌కో, జెన్కో యాజమాన్యాలతో సమీక్ష నిర్వహించారు. వాతావరణ మార్పుల కారణంగా సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిపై ఎక్కువ ఆధారపడకూడదని, వాటికి ప్రత్యామ్నాయంగా జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ ఏడాది జూలై నుంచి సగటున రోజుకి 15.5 మిలియన్ యూనిట్ల జల విద్యుదుత్పత్తి జరుగుతోందని, విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. అక్టోబరు నెలలో పండుగలు, వ్యవసాయానికి అనువైన కాలం కావడంతో, విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడానికి సంసిద్ధంగా ఉండాలని సీఎస్ కోరారు. వినియోగదారులకు 24/7 నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో జెన్కో ఎండీ నాగలక్ష్మి, ట్రాన్స్‌కో ఇన్‌చార్జి జేఎండీ పృధ్వీతేజతో పాటు ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఏకేవీ భాస్కర్, జేవీరావు, ఎన్‌వీ రమణమూర్తి, జెన్కో డైరెక్టర్లు సుజయ్‌కుమార్, అశోక్‌కుమార్ రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సభలో 'సినీ' రగడ

కామినేని వ్యాఖ్యలకు బాలకృష్ణ కౌంటర్

జగన్‌పై ధ్వజం... చిరంజీవి ప్రస్తావన

బాలయ్య మాటలపై చిరు తీవ్ర స్పందన

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శాసన సభ వేదికగా 'సినీ' రగడ రాజుకుంది. బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ తీవ్రంగా స్పందించారు. దీనికి ప్రతిస్పందనగా చిరంజీవి సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. జగన్ సీఎంగా ఉండగా సినీ ప్రముఖులను అవమానించారని... ఆయన వైఖరికి ఇదొక ఉదాహరణ అని కామినేని శ్రీనివాస్ గురువారం సభలో పేర్కొన్నారు. దీనిపై వారి వ్యాఖ్యలు, స్పందన, ప్రతిస్పందనలు ఇవి...

చిరంజీవి గట్టిగా అడిగితే...: కామినేని



జగన్మోహన్‌రెడ్డిది ఎంత సైకో మనస్తత్వమంటే.. చిరంజీవిని, ఆయన భార్య సురేఖను ఒకసారి రమ్మంటే వెళ్లినప్పుడు కారు పోర్టికోలోకి వెళ్లగానే జగన్ దంపతులు వచ్చి లోపలకు తీసుకెళ్లారు. తర్వాత సినిమా వాళ్ల సమస్యలపై చర్చించాలని అడిగితే ఆయనే (జగన్) జాబితా పంపారు. ఆ జాబితాలో బాలకృష్ణ, ఇతరులెవరూ లేరు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఉంటున్న ప్రభాస్, మహేష్, రాజమౌళిని రమ్మన్నారు.. వాళ్లు రాబోమన్నా చిరంజీవి గారే రమ్మని అడగడంతో మొహమాటంతో వస్తే.. ఫస్ట్ షాక్. గేటు దగ్గరే కార్లు ఆపేశారు. అందరినీ కార్లు దిగి రమ్మన్నారు. అదేంటనుకుని కార్లు దిగి లోపలకు వెళ్లారు. లోపల సెకండ్ షాక్. ఇంత పెద్దవారిని పిలిచి అక్కడ పోసాని కృష్ణమురళి లాంటి వారిని కూర్చోబెట్టారు. తర్వాత మూడో షాక్. సీఎం గారు మిమ్మల్ని కలవట్లేదు.. సినిమాటోగ్రఫీ మంత్రి వచ్చి మాట్లాడతారని అన్నారు అప్పుడు చిరంజీవి గారు కొద్దిగా గట్టిగానే.. అదేంటండి.. మీరు పిలిచారని నేను వీరందరినీ తీసుకొస్తే ఆయన రానంటారా.. అని అడిగారు. అప్పుడు జగన్ వచ్చారు. మీరొక తండ్రిలా సినిమా పరిశ్రమను జాగ్రత్తగా చూసుకోండని చిరంజీవి మంచిఉద్దేశంతో రిక్వెస్ట్ చేస్తే.. ఆ వీడియో బయటకు రిలీజ్ చేశారు. ఎంత అవమానం? శాడిస్ట్ మెంటాలిటీకి ఇంతకన్నా ఉదాహరణ ఏమి కావాలి?'

గట్టిగా ఎవరడిగారు: బాలకృష్ణ



అప్పుడు ఇండస్ట్రీ వాళ్లందరూ సైకో గాడిని కలవడానికి వెళ్లినప్పుడు చిరంజీవి గారు గట్టిగా అడిగితే అప్పుడు ఈయన (జగన్) వచ్చాడు అన్నది అబద్ధం. అక్కడ గట్టిగా ఎవ్వడూ అడగలేదు.. సినిమాటోగ్రఫీ మంత్రిని కలవమన్నారు.. ఆ వీడియో పెట్టడం, అవమానించడం నిజం. ఆయన (చిరు) ఏదో పెద్దగా చెబితే ఈయన (జగన్) దిగొచ్చాడంటా.. మొన్న కూడా నాకు ఇన్విటేషన్ వచ్చింది. ఇక్కడ ఫిల్మ్ డెవలప్మెంట్ జాబితా తయారు చేయమని! అందులో నాది తొమ్మిదో పేరు! మంత్రి కందుల దుర్గేశ్ గారిని అడిగా.. ఎవడు వాడు వేసిందని! మర్యాద ఇవ్వడం మానవత్వం. (కామినేని వైపు చూస్తూ..) అదేదో గట్టిగా.. ఎవడడిగాడు? గట్టిగా అడిగితే పంపించారా లోపలికి! ఆ రోజు గట్టిగా అడిగిన వారెవరూ లేరు. మీరు తెలీకుండా మాట్లాడుతున్నారు. అయితే ఆయన(చిరంజీవి)కు అవమానం జరిగింది వాస్తవమే. (స్పీకర్ వైపు చూస్తూ..) సారీ.. వివరణ ఇవ్వడమే నా ఉద్దేశం!'

బాలకృష్ణ అందుబాటులో లేరు: చిరంజీవి

'ఏపీలో జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు తెలుగు చిత్రపరిశ్రమలోని కొందరు నిర్మాతలు, దర్శకులు, ఫిల్మ్ చాంబర్ ప్రతినిధులు నా దగ్గరకు వచ్చి, నిర్మాణ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా టికెట్ల ధరల పెంపుదల గురించి ప్రభుత్వంతో మాట్లాడమని నన్ను కోరారు. వారిలో దర్శకులు రాజమౌళి, కొరటాల శివ, త్రివిక్రమ్ శ్రీనివాస్, హీరోలు మహేశ్, ఎన్టీఆర్, నిర్మాత డీవీవీ దానయ్య తదితరులు ఉన్నారు. వారి సూచనల మేరకు అప్పటి సినిమాటోగ్రఫీ మంత్రి పేర్ని నానితో ఫోన్‌లో మాట్లాడాను. సీఎంతో చర్చించి చెబుతానని ఆయన చెప్పారు. ఆ తర్వాత మంత్రి నాకు ఫోను చేసి... జగన్ వన్ టు వన్ కలుస్తారని చెప్పి, లంచ్‌కి ఆహ్వానించారు. నేను సీఎం నివాసానికి వెళ్లగా ఆయన నన్ను సాదరంగా ఆహ్వానించారు. జగన్‌కు సినీ పరిశ్రమ ఇబ్బందుల్ని వివరించాను. సమయం ఇస్తే అందరం కలిసి వస్తామని తెలిపాను. కొన్ని రోజుల తర్వాత మంత్రి పేర్ని నాని ఫోన్ చేసి కొవిడ్ రెండో దశ కొనసాగుతున్నందు వల్ల ఐదుగురు మాత్రమే వస్తే బాగుంటుందని చెప్పారు. నేనప్పుడు ఓ పదిమందిమి వస్తామని చెబితే సరేనన్నారు. ఆ సమయంలో బాలకృష్ణను ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించాను. ఆయన అందుబాటులోకి రాలేదు. బాలకృష్ణను కలవమని జెమిని కిరణ్‌ను పంపించాను. ఆయన మూడు సార్లు ప్రయత్నించినా బాలకృష్ణను కలవలేకపోయారు. దాంతో నేను ఓ విమానం ఏర్పాటు చేసి ఆర్. నారాయణమూర్తితో సహా మరికొందరితో వెళ్లి సీఎంను కలిశాం. సినీ పరిశ్రమ ఇబ్బందుల్ని వివరించి, ప్రభుత్వ సహకారం కోరాను. నేను చొరవ తీసుకోవడం వల్లే అప్పుడు ప్రభుత్వం టికెట్ ధరల పెంపునకు అంగీకరించింది. ఆ నిర్ణయం వల్లే 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ నటించిన 'వీరసింహా రెడ్డి' వంటి సినిమాలకు టికెట్ రేట్లు పెంచడానికి కారణమైంది. నేను సీఎంతోనైనా, సామాన్యుడితో అయినా నా సహజ ధోరణిలోనే మాట్లాడుతాను.'



పత్తి క్వింటా రూ.8,110

- వచ్చే నెల నుంచి సీసీఐ ద్వారా కొనుగోళ్లు
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025-26 సీజన్‌లో గుర్తించిన మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలుకు ప్రభుత్వం గురువారం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రంలో ఈ ఏడాది 4.02 లక్షల హెక్టార్లలో పత్తి పండించగా, 7.12 లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. సీఎం యాప్ ద్వారా కనీస మద్దతు ధరకు వచ్చే నెల నుంచి పత్తి కొనుగోలును సీసీఐ ప్రారంభిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. పొడవు పింజ పత్తి క్వింటా రూ.8,110, మధ్యస్థ పింజ పత్తి క్వింటా రూ.7,710 చొప్పున కొననున్నట్టు పేర్కొంది. సీసీఐ కొత్త నిబంధనల మేరకు ఎంపిక చేసిన మార్కెట్ యార్డులతో పాటు నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి సేకరణకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఆధార్ ఆధారిత ఈ-పంట డేటా ప్రకారం పత్తి రైతులను గ్రామ వ్యవసాయ సహాయకులు గుర్తించి, రైతు సేవా కేంద్రంలో నమోదు చేయనున్నారు. కాపాస్ కిసాన్ యాప్‌తో డేటా అనుసంధానం చేసి, స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనున్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. స్లాట్ బుకింగ్ నేపథ్యంలో మండలాల వారీగా పంట దిగుబడి, కోత సమయాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. యార్డులు, మిల్లుల్లో పత్తి నిల్వలకు బీమా ఉండాలని నిర్దేశించింది. ప్లాస్టిక్, గన్నీ బ్యాగులను నివారించేందుకు రైతులు లూజు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించింది. పత్తి రైతుల కుటుంబ సభ్యులను గుర్తించేందుకు రేషన్‌కార్డులోని డేటాను సీఎంయాప్‌కు అనుసంధానం చేయాలని పౌర సరఫరాలశాఖను ఆదేశించింది. రైతుల ఆధార్ లింక్డ్ బ్యాంక్ అకౌంట్‌కు సీసీఐ నగదు చెల్లింపులు జరపాలని నిర్దేశించింది. పత్తి అమ్మకం కోసం వివరాల నమోదు సమయంలో ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం ఫొటో కాపీలను రైతులు తీసుకు రావాలని స్పష్టం చేసింది. సాగు విస్తీర్ణం, దిగుబడి, పత్తితీతల మేరకు మండలాల వారీగా అమ్మకానికి రైతులను అనుమతించనున్నారు. పత్తి నాణ్యతాప్రమాణాలను రైతులకు వివరించాలని, అగ్ని నిరోధక, తేమ శాతం గుర్తింపు పరికరాలు, టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూనికలు, సీసీ కెమేరాలు మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేయాలని మార్కెటింగ్‌శాఖను ఆదేశించింది. జిన్నింగ్ మిల్లుల్లో సీసీ కెమేరాల ఏర్పాటుపై హైకోర్టు ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సీసీఐకి సూచించింది. పత్తి రవాణా వివరాలూ యాప్‌లో నమోదు చేసి, రవాణాదారులకు చెల్లింపులు జరపాలని పేర్కొంది. జిల్లా స్థాయిలో పత్తి కొనుగోలు కార్యకలాపాల పర్యవేక్షణకు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రైతు సమస్యలపై నేడు సీఎంకు షర్మిల వినతిపత్రం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి వినతిపత్రం అందజేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటనను ఆమె విడుదల చేశారు. శుక్రవారం మధ్యాహ్నం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో 'రైతన్నకు అండగా కాంగ్రెస్' కార్యక్రమాన్ని చేపడతామన్నారు. అన్నదాతల ఆక్రందనలపై కూటమి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల గురించి కాంగ్రెస్ నేతలతో చర్చించాక .. సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళతామని తెలిపారు.

వరద జలాలపై మాకే సంపూర్ణ హక్కులు

- కృష్ణా ట్రైబ్యునల్ ముందు ఏపీ స్పష్టీకరణ
- వచ్చే నెల 29, 30, 31 తేదీల్లో కొనసాగనున్న వాదనలు

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ జలాల వివాద ట్రైబ్యునల్ కేటాయించిన నికర జలాలతో పాటు వరద జలాలపైనా దిగువ రాష్ట్రంగా తమకే సంపూర్ణ హక్కులు ఉంటాయని ఆంధ్రప్రదేశ్ స్పష్టంచేసింది. గురువారం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్-2 ముందు రాష్ట్రప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు ప్రారంభించారు. ఎగువన ఉన్న తెలంగాణ నుంచి దిగువన ఉన్న తమ ప్రాజెక్టుల్లోకి కృష్ణా జలాలు వచ్చేశాక.. వాటిపై పూర్తి హక్కు తమకే ఉంటుందన్నారు. తమ భూభాగంలోకి వచ్చిన జలాలపై తెలంగాణకు ఎలాంటి హక్కులూ ఉండబోవని తెలిపారు. సోమ, మంగళ, బుధవారాల్లో తెలంగాణ వాదనలు వినిపించగా.. గురువారం ఏపీ వాదనలు ప్రారంభమయ్యాయి. తదుపరి విచారణ వచ్చే నెలాఖరుకు వాయిదాపడింది. అక్టోబరు 29, 30, 31 తేదీల్లో ఏపీ వాదనలు కొనసాగుతాయని ట్రైబ్యునల్ పేర్కొంది. కాగా.. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాల్లో తమకు 70% వాటా ఇవ్వాలని తెలంగాణ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.



ముగిసిన 'జల ప్రహార్' విన్యాసాలు

భారత ఆర్మీతో కలిసి నౌకాదళం ఏడాదికి రెండుసార్లు నిర్వహించే 'జల ప్రహార్' విన్యాసాలు విశాఖలో బుధవారం ముగిశాయి. వీటిని సముద్రంలోను, తీర ప్రాంతంలోనూ నిర్వహించారు. ఇందులో ఐఎన్ఎస్ ఘరియల్ పాల్గొందని నేవీ వర్గాలు తెలిపాయి.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఇక 'రెవెన్యూ' కష్టాలకు చెల్లు!

- వచ్చే నెలంతా ప్రణాళికా శాఖ ఇంటింటి సర్వే
- ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు నిక్షిప్తం
- నవంబరు నుంచి ఆర్టీజీఎస్‌కు అందజేత
- వాట్సప్ గవర్నెన్స్ నుంచి ప్రజలు నేరుగా పత్రాలు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదాయ, నివాస, కుల, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల విషయంలో రెవెన్యూ శాఖ చుక్కలు చూపిస్తోందని.. ప్రతి వారం రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో తేలింది. ప్రజలను ఇబ్బందులకు గురి చేయడంలో రెవెన్యూ, పోలీసు శాఖలు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ శాఖలో ప్రతి సర్టిఫికెట్‌కు లంచం ఇస్తేనే పని చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. వాట్సప్ గవర్నెన్స్ అమల్లోకి వచ్చాక మండల తహసీల్దారు కార్యాలయాలకు లబ్ధిదారులు, దరఖాస్తుదారులను రప్పించవద్దంటూ ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అయినా కూడా రెవెన్యూ శాఖలో మార్పు రాలేదు. వారాంతపు సమీక్షా వివరాలను ఆర్టీజీఎస్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కుటుంబానికి సంబంధించిన సమస్త సమాచారం ఆర్టీజీఎస్ వద్ద ఉన్నందున వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయాలని సీఎం ఆదేశించారు. అదేవిధంగా పుట్టుకతో వచ్చిన కులం మధ్యలో మారిపోదు కదా అని సీఎం పేర్కొన్నారు. ఆదాయానికీ ఇదే విధానం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పత్రాలను నేరుగా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి మౌఖికంగా సర్వే నిర్వహించిన ప్రణాళికా శాఖ అక్టోబరులో మరోసారి సర్వేకు సిద్ధమవుతోంది. నెల రోజుల పాటు ఇంటింటి సర్వే చేసి ప్రధానమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను నిక్షిప్తం చేయనుంది. నవంబరు నుంచి వాటిని ఆర్టీజీఎస్‌కు అందజేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల డేటాను క్రోడీకరించుకుని వారికి అవసరమైనప్పుడు ధ్రువీకరణ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని వాట్సప్ గవర్నెన్స్ కల్పిస్తుందని 'ఆంధ్రజ్యోతి'కి కాటంనేని భాస్కర్ వివరించారు.

వేలకోట్లు వెచ్చిస్తున్నా
ఉద్దేశం నెరవేరట్లేదు!

- కేజీబీవీల్లో శాశ్వత సిబ్బందిని నియమించకపోవడంపై హైకోర్టు ఆగ్రహం
- అర్హులైన బోధన సిబ్బంది లేకుండా నాణ్యమైన విద్య ఎలా సాధ్యమని ప్రశ్న
- 14న కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని కేంద్ర మానవ వనరుల కార్యదర్శికి ఆదేశం
- రాష్ట్ర పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శికి కూడా

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 21 ఏళ్లుగా ఏటా వేల కోట్లు ఖర్చు చేస్తున్నా కేజీబీవీల ఏర్పాటు ఉద్దేశం నెరవేరట్లేదని హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. సర్వశిక్షా అభియాన్ పథకం కింద ఏర్పాటు చేసిన కేజీబీవీలలో శాశ్వత ప్రాతిపదికన అర్హులైన బోధనా సిబ్బందిని నియమించకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించింది. శాశ్వత సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీ, అణగారినవర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో 2004లో ఈ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తుచేసింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పాలసీలో శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది నియామకం గురించి ప్రస్తావించారని, మరోవైపు ప్రతి ఏడాది కాంట్రాక్ట్ పద్ధతిలో సిబ్బందిని నియమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేశారని పేర్కొంది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో స్థిరమైన వైఖరి కనిపించడంలేదంది. ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటున్నారని తెలిపింది. తగినన్ని అవకాశాలు ఇచ్చినప్పటికీ సరైన వివరాలు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయంది. వివరణ ఇచ్చేందుకు అక్టోబరు 14న తమ ముందు హాజరుకావాలని కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యదర్శిని, రాష్ట్ర పాఠశాల విద్యశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. విచారణను వచ్చేనెల 14వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టుదేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీ)ల్లో పనిచేస్తున్న తమను అర్ధంతరంగా తొలగించడాన్ని సవాల్ చేస్తూ పార్ట్‌టైం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీలు) 2023లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పిటిషనర్లను ఉద్యోగాలలో నుంచి తొలగించడాన్ని తప్పుపట్టారు. వారిని కొనసాగించాలని అధికారులను ఆదేశిస్తూ 2023 డిసెంబరు 5న తీర్పు ఇచ్చారు. ఆ తీర్పును సవాల్ చేస్తూ అధికారులు 2024 జనవరిలో ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఈ అప్పీల్ గురువారం మరోసారి విచారణకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ వాదిస్తూ.. శాశ్వత ప్రాతిపదికన బోధన సిబ్బందిని నియామించుకొనే వెసులుబాటు కేంద్రం రూపొందించిన పాలసీలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ...బోధన సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో ఏర్పాటు చేసుకోవాలని కేంద్రం రాష్ట్రానికి సూచనలు చేసిందన్నారు. సర్వశిక్షా అభియాన్‌లో నడిచే విద్యాసంస్థలకు అయ్యే ఖర్చులో 60 శాతాన్ని కేంద్ర ప్రభుత్వం ఇస్తోందని, కేంద్రం చెప్పినట్లు నడుచుకోకుంటే ఆ సొమ్మును విడుదల చేయరని తెలిపారు. ఇరువైపుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు తమ ముందు హాజరుకావాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిలను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పోరాట ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా



మలయాళ దర్శకుడు డాక్టర్ ప్రగబల్ తెరకెక్కిస్తున్న చిత్రం 'జాకీ'. యువన్ కృష్ణ, రిధాన్ కృష్ణన్, అమ్ము అభిరామి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రేమకృష్ణ దాస్, సీ ప్రేమదాస్ నిర్మిస్తున్నారు. మధురైలో సంప్రదాయంగా కొనసాగుతున్న పొట్టేలు పందేల చుట్టూ సాగే ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. చిత్రబృందం గురువారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రగబల్ మాట్లాడుతూ 'ఆసక్తికరమైన కథాంశంతో 'జాకీ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నా. ప్రేక్షకులను థ్రిల్ చేసేలా ఉంటుంది. పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రం ఇది. పొట్టేలు పందేలు, పాత్రల భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. రియల్ లొకేషన్లలో సినిమాను చిత్రీకరించాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శక్తి బాలాజీ, సినిమాటోగ్రఫీ: ఉదయ్ కుమార్.

పవన్‌తో సినిమా ఆనందంగా ఉంది

- సుజీత్



'దాదాపు మూడేళ్ల ప్రయాణం. మొదటి రోజు నుంచి మమ్మల్ని సపోర్ట్ చేస్తూ, మా పక్కనే ఉంటూ మాకు కావాల్సినవన్నీ ఏర్పాటు చేసిన నిర్మాతలు డీవీవీ దానయ్య, కల్యాణ్ గారికి కృతజ్ఞతలు. అలాగే 'ఓజీ' కథకి ఇంతటి భారీతనం రావడానికి కారణమైన పవన్ కల్యాణ్‌కి కృతజ్ఞతలు. నేను ఆయన వీరాభిమానిని. 'జానీ' సినిమా సమయం నుంచి పవన్‌గారిని కలిస్తే చాలు అనుకునేవాడిని. అలాంటిది ఇప్పుడు ఆయనతో సినిమా చేయడం, దానికి బ్లాక్ బస్టర్ టాక్ రావడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు దర్శకుడు సుజీత్. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన 'ఓజీ' సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ 'విడుదలకు ముందు సినిమా పట్ల చాలా నమ్మకంగా ఉన్నాము. మా నమ్మకం నిజమైంది, విజయం సాధించిన తర్వాత భయం, బాధ్యత పెరిగాయి. 'ఓజీ' సినిమా మాది కాదు. దీన్ని ప్రేక్షకులు తమదిగా భావిస్తున్నారు. ఎక్కడ చూసినా 'ఓజీ' సందడే కనిపిస్తోంది. పవన్ కల్యాణ్ గారికి ఉండే పవర్ అది. 'వకీల్ సాబ్, భీమ్లా నాయక్, బ్రో, ఓజీ' ఇలా వరుసగా పవన్ కల్యాణ్ గారి సినిమాలకు పనిచేసే అవకాశం రావడం చిన్న విషయం కాదు' అని అన్నారు. డీవీవీ దానయ్య మాట్లాడుతూ 'పవన్ కల్యాణ్ గారి అభిమానులకు నచ్చే సినిమా అందించాలనే ఉద్దేశంతో ఎంతో శ్రద్ధతో ఈ సినిమా చేశాం. తమన్, నవీన్ నూలి, రవి చంద్రన్ ముగ్గురూ ఈ సినిమాకు మూడు స్థంభాల్లాంటి వారు. అభిమానుల స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు.

ఏఐతో నా ఫొటోలు మార్ఫింగ్ చేస్తున్నారు


- డిల్లీ హైకోర్టులో నాగార్జున పిటిషన్
- వ్యక్తిగత హక్కులను కాపాడుతామన్న న్యాయస్థానం



కొన్ని వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తన అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు వాడుతూ దుర్వినియోగం చేస్తున్నాయని, పబ్లిసిటీ, పర్సనాలిటీ హక్కులకు రక్షణ కల్పించాలని కోరుతూ అక్కినేని నాగార్జున ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కొందరు తన ఫొటోలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరమైన కంటెంట్, లింక్‌లు సృష్టిస్తున్నారని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగిస్తోందని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. గురువారం ఆ పిటిషన్ జస్టిస్ తేజస్ కరియా సింగ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. నాగార్జున తరపున న్యాయవాది ప్రవీణ్ ఆనంద్ వాదనలు వినిపించారు. దీనికి సంబంధించి 14 యూఆర్ఎస్ (యూనిఫాం రిసోర్స్ లొకేటరీ)లు కోర్టుకు సమర్పించారు. జస్టిస్ కరియా స్పందిస్తూ... 'మీ దగ్గర యూఆర్ఎల్ ఉన్నాయి కదా? ఆ లింక్‌లను తొలగించమని వారికే చెప్పవచ్చు కదా?' అని ప్రశ్నించారు. తామిచ్చే ఆదేశాలతో ఎంత కాలం ఇలాంటివి ఆపగలమని వ్యాఖ్యానించారు. అలాగని, తామేమీ చూస్తూ ఊరుకోమని తెలిపారు. ప్రస్తుతం ఏఐ ఇంటర్నెట్‌లో భాగమైన తర్వాత పెద్ద సమస్యగా తయారైందని వ్యాఖ్యానించారు. నాగార్జున వ్యక్తిగత హక్కులకు భంగం కలగకుండా చూస్తామన్నారు. తక్షణమే ఆ లింకులను తొలగించాలని ఆయా యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్లకు ఆదేశాలు జారీ చేశారు.

-న్యూఢిల్లీ, ఆంధ్రజ్యోతి

జటాధర తొలి గీతం



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రధారులుగా వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న పాన్ ఇండియా చిత్రం 'జటాధర'. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేశ్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హల్, నిఖిల్ నందా నిర్మిస్తున్నారు. నవంబరు 7న తెలుగు, హిందీ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా మేకర్స్ ఈ చిత్రం నుంచి 'ఓం నమఃశివాయ్..' అంటూ సాగే తొలి పాట సోల్ ఆఫ్ జటాధర ట్రాక్ ప్రోమోను విడుదల చేశారు. కాగా, ఈ సినిమాలో శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషిస్తున్నారు.


ఆసక్తిగా 'గోదారి గట్టుపైన'



సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్, జగపతి బాబు ప్రధాన పాత్రధారులుగా నూతన దర్శకుడు సుభాష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'గోదారి గట్టుపైన'. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ పతాకంపై అభినవ్ రావు నిర్మిస్తున్నారు. తాజాగా యూనిట్ ఈ చిత్రం నుంచి ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేసింది. లైట్ హౌస్ పైకి తన ప్రేమికురాలిని తీసుకెళ్లిన హీరో, గోదావరి సముద్రంలో కలసిపోయే అద్భుత దృశ్యం చూపించే సన్నివేశంతో వీడియో ప్రారంభమవుతుంది. 'మనుషులు కూడా భేదాభిప్రాయాలు లేకుండా ఒకటిగా కలిసిపోతే ఈ మత భేదాలు అనేవి ఉండవు కదా' అని సుమంత్ ప్రభాస్ పలికే సంభాషణలు ఆసక్తిగా ఉన్నాయి. కాగా, నిధి ప్రదీప్ ఈ చిత్రం ద్వారా కథానాయికగా పరిచయం అవుతున్నారు.

మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని భారీగా విడుదల చేయడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 3,38 360 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుతోంది. వరద ఉధృతి 4 లక్షల క్యూసెక్కుల కన్నా తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 3,28,125 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. అలాగే తూర్పు డెల్టా కాల్వకు 5722, పశ్చిమ డెల్టాకు 4513 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు. దిగువ నదీతీర ప్రాంతాల వాసులు, లంకభూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

పులిచింతలకు 2,62,741 క్యూసెక్కులు

రెంటచింతల,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 20 రేడియల్ గేట్లకు 12 గేట్లను 4 మీటర్లు, ఒక గేట్‌ను రెండు మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 2,62,741 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ఎస్‌ఈ కె.వెంకటరమణ తెలిపారు. సాగర్ నుంచి 2,61,450 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.99 మీటర్ల మేర నీరుండగా.. 6.890 టీఎంసీలకు సమానమన్నారు. విద్యుదుత్పత్తి జరగడం లేదని తెలిపారు.

26 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల


26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు గురువారం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 586.70 అడుగులు ఉంది. ఇది 303.94 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 9019, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,373, 22 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగులు, 4 క్రస్ట్‌గేట్లను పది అడుగులు మేర ఎత్తి 2,28,024, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 2,73,116 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 2,73,116 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నేడు రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు ఈ-లాటరీ

తుళ్లూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోత): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన మరికొందరు రైతులకు సీఆర్డీఏ రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించనుంది. పెనుమాక (జరీబు, మెట్ట), మల్కాపురం గ్రామ రైతులకు (ప్రత్యామ్నాయ ప్లాట్లు) శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి విజయవాడ లెనిన్ సెంటరులోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ - లాటరీ జరగనుంది. 56 మంది రైతులకు 104 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయిస్తారు. వీటిలో 43 రెసిడెన్షియల్, 41 కమర్షియల్, 20 ప్రత్యామ్నాయ ప్లాట్లు ఉన్నాయి. సంబంధిత రైతులు పాల్గొనాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ప్రతి ఒక్కరూ ఎంతగానో సహకరించారు

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా


హెనీక్రిస్టీనాకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి సహకారంతో సమర్థంగా పరిపాలన అందిస్తున్నానని.. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా పేర్కొన్నారు. ఆమె పదవీ బాధ్యతలు చేపట్టి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా గురువారం జడ్పీ క్యాంపు కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేశారు. అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి ఉద్యోగులు తమవంతు సహకారాన్ని అందించారని హెనీక్రిస్టీనా తెలిపారు. పరిపాలన అధికారి రాజా రత్నబాబు, అకౌంట్ ఆఫీసర్ శామ్యూల్‌పాల్, రామకోటయ్య, తన్నీరు శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ కూచిపూడి మోహన్ రావు, జిల్లా పరిషత్ అసోసియేషన్ ఉమెన్ వింగ్ రిప్రజెంటేటివ్ తోట ఉషాదేవి, అరుణ తదితరులు చైర్‌పరన్‌ఉ సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

రేషన్ అక్రమ రవాణాకు 'రెడ్' సిగ్నల్!

(3వ పేజీ తరువాయి)

అమల్లోకి వచ్చింది.

'రెడ్' హ్యాండెడ్‌గా పట్టుకోవచ్చు..!

ఫోర్టిఫైడ్ బియ్యాన్ని నిర్ధారించేందుకు కిట్‌లో రెండు కెమికల్స్ ఉంటాయి. ఫోర్టిఫైడ్ బియ్యపు గింజలపై కెమికల్ చుక్కలు వేయగానే అవి ఎరుపు రంగులోకి మారుతాయి. ఎందుకంటే ఈ ఫోర్టిఫైడ్ గింజల్లో విటమిన్లు కలిసి ఉండటమే. ఇలా రేషన్ బియ్యాన్ని ఇక నుంచి నిర్ధారించవచ్చు. చిన్న బియ్యం ఆకారపు గింజలను ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్(ఎఫ్ఆర్‌కే) అంటారు. ఈ బియ్యం పంపిణీ అమల్లోకి వచ్చిన కొత్తలో చైనా బియ్యం, ప్లాస్టిక్ బియ్యం అంటూ ప్రజలు అపోహలకు గురయ్యారు. ఈ బియ్యపు గింజలు.. నీటిలో తేలాడుతాయని, అందువల్లే వీటిని ప్లాస్టిక్ బియ్యంగా ప్రజలు భావించారు. ఈ అపోహలను పౌరసరఫరాల శాఖ నివృత్తి చేసింది.

నియోజకవర్గానికి ఒక కిట్..

ప్రతి జిల్లాకు ఈ కిట్లు సరఫరా అయ్యాయి. ఒక కిట్ జిల్లా సరఫరా అధికారి వద్ద ఉంటుంది. పౌర సరఫరాల టీటీలకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున అందజేశారు. కిట్ల సంఖ్య ఇంకా పెరగనుంది. మొత్తం మీద చౌక బియ్యం అక్రమాలకు చెక్ పెట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది.

ఒక్క చాన్స్ అడిగారు... నెత్తిన కుంపటి పెట్టారు

● శాంతి భద్రతలు, సోషల్ మీడియా విషప్రచారంపై కఠినంగా ఉండాలి ● అసెంబ్లీలో ఎమ్మెల్యే యరపతినేని


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్ర తలకు విఘాతం కలిగించే ఎవరిపైన అయినా కఠినంగా వ్యవహరిం చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గురజాల ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు కోరారు. గురువారం అసెంబ్లీలో శాంతిభద్రతల అంశంపై ఆయన ప్రస్తావిస్తూ.. 2019లో ఒక్క చాన్స్ అడి గారని, ఇస్తే రాష్ట్ర ప్రజల నెత్తిన కుంపటి పెట్టి పోయారన్నారు. వైసీపీకి అవకాశం ఇస్తే కరెంటు తీగలు పట్టుకున్నట్టేనని ఆనాడు సీఎం చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. 16 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రాజధాని పర్యటనకు వస్తే చెప్పులు వే శారని, దీనిపై ఆనాటి డీజీపీ వ్యాఖ్యలు చూస్తే భావ ప్రకటన స్వేచ్ఛ అన్నారన్నారు. అలా చేయడం తమకు చేతకాక కాదని, క్రమ శిక్షణ కలిగిన పార్టీలో పనిచేస్తున్న తామంతా.. అలా చేయకూడదన్న ము ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దిశానిర్దేశంతో ఓపిగ్గా ఉన్నామని యరపతి నేని స్పష్టం చేశారు. శాంతిభద్రతలను కాపాడుతూ మహిళలను గౌరవిస్తూ.. ఎన్నో పథకాలకు మహిళల పేర్లతో ఇస్తున్నామని దీంతో మహి ళల్లో ప్రజాదరణ వచ్చిందన్నారు. మంచి ఆలోచనలు వైసీపీ నాయకులకు లేవన్నారు. సభలో చంద్రబాబు లాంటి మచ్చలేని నాయకులపై, రాజధాని మహిళలు, రైతులపై అసత్య ప్రచారాలు చేయడం తోపాటు అనేక ప్రాంతాల్లో అత్యాచారాలకు పాల్పడిన వైసీపీ నేతలు.. నేడు మహిళల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వైసీపీ ప్రభుత్వం అనేకన్నా.. పైశాచిక ప్రభుత్వం అంటే బాగుంటుందేమో నని యరపతినేని అభిప్రాయపడ్డారు. వైసీపీ నేతలు కొందరు ఇప్పటికీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారానికి పాల్పడుతూ.. మహిళలను కించపరి చేలా పోస్టులు పెడుతున్నారన్నారు. అలాంటి వారిని తేలికగా తీసుకోవద్దని సభలో యరపతినేని ప్రస్తావించారు. అడ్డగోలుగా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. అలాంటి వారిపై కూడా ప్రభుత్వం కఠినంగా వ్యవ హరించాల్సి ఉందన్నారు. జిల్లా అధికారులు కూడా తగిన ఆదేశాలు ఇస్తూ సోషల్ మీడియాలో మహిళలను కించపరి చేలా పోస్టులు పెట్టే వారిపై కఠినంగా వ్యవహరించే విధంగా ఆదేశాలివ్వాల్సి ఉందన్నారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే యరపతినేని సభలో ప్రస్తావించారు.

జీఎస్టీ సంస్కరణలు వినియోగదారులకు అందించాలి

● 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ దినకర్



సదస్సులో ప్రసంగిస్తున్న కమిటీ చైర్మన్ లంకా దినకర్

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలను వినియోగదారులకు అందించడం వ్యాపారుల నైతిక బాధ్యత అని 20 సూత్రాల అమలు కమిటీ చైరన్ లంకా దినకర్ అన్నారు. గురువారం జేకేసీ కళాశాల రోడ్డులోని మీటింగ్ హాల్‌లో జీఎస్టీ సంస్కరణలపై అవగాహన సదస్సు నిర్వహించారు. లంకా దినకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్దేశానికి తూట్లు పొడవకుండా పేద, మధ్య తరగతి ప్రజలకు లాభం చేకూరుతుందో.. లేదో చూడాల్సిన బాధ్యత జీఎస్టీ అధికారులు, వినియోగదారుల కమిషన్‌దేనన్నారు. తగ్గిన ధరలకు సంబంధించిన మేలు వినియోగదారులకు అందేవిధంగా విషయ పరిజ్ఞానాన్ని ప్రజలకు చేర్చే ప్రక్రియకు తాము ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ శ్లాబులు తగ్గించడం వల్ల దేశ ఆర్థిక రంగం పరుగులు పెడుతుందన్నారు. ఈ సదస్సులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు జీఎస్టీ సూపరింటెండెంట్ నాగేశ్వరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది రంగరాజు, భీమినేని చంద్రశేఖర్, డాక్టర్ రాధ మాధవి, దర్శనం శ్రీనివాస్, స్వరూపరాణి, శ్రీనివాసరెడ్డి, కొక్కిర శ్రీనివాస్ యాదవ్, చార్టెడ్ అకౌంటెంట్స్, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు ప్రొఫెసర్లు, ఇంజనీర్స్ తదితరులు పాల్గొన్నారు

సామాజిక అభివృద్ధిపై ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్‌తో కాకినాడలోని యూనివర్సిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్ ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్ శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ప్రొఫెసర్ ఆచార్య వై.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ జి.అబ్బయ్య, సెక్రటరీ డాక్టర్ ఎ.శ్రీనివాస్, మెంటార్ డాక్టర్ కె. కృష్ణమోహన్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా సామాజిక బాధ్యతను సమాజంలోకి తీసుకెళ్లే విధంగా రెండు సంస్థలు పనిచేస్తాయన్నారు. ఎంఓయూ ద్వారా సంయుక్తంగా పలు సామాజిక అభివృద్ధి, పరిశోధన కార్యక్రమాలను నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు, సిబ్బంది డాక్టర్ వి .శ్రీనివాస్ పాల్గొన్నారు.

జ్ఞానేశ్వరి ఫౌండేషన్‌పై చర్యలకు ప్రత్తిపాటి డిమాండ్

చిలకలూరిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటకు చెందిన సంస్థ జ్ఞానేశ్వరి ఫౌండేషన్ అక్రమాలపై ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో ప్రజలకు తెలియజేయాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అసెంబ్లీలో కోరారు. ప్రశ్నోత్తరాల సమయంలో.. పనులు చేయకుండానే రూ.వందల కోట్ల బిల్లులు తీసుకొని మోసగించిన సంస్థను ఉపేక్షిస్తే.. ప్రజలకు చెడు సంకేతాలు వెళ్తాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పరిధిలో ఆ సంస్థ చేపట్టిన పనులపై పూర్తి వాస్తవాలు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. సంస్థ నిర్వాహకులను కఠినంగా శిక్షిస్తేనే ప్రభుత్వంపై ప్రజల నమ్మకం రెట్టింపు అవుతుందని చెప్పారు.

చీఫ్‌విప్ జీవీకి ప్రత్యేక క్యాబిన్


చీఫ్‌విప్ జీవీని అభినందిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

వినుకొండ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో మంత్రులు, విప్‌లకు కేటాయించిన నూతన క్యాబిన్‌లను గురువారం స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రారంభించారు. మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చీఫ్ విప్ జీవీకి ప్రత్యేకంగా కేటాయించిన క్యాబిన్‌లో మంత్రులు నారాయణ, కేశవ్‌లు ఆయనను అభినందించారు.

తెలుగు నుడికారానికి గుడికట్టిన కవి జాషువా

● తెలుగు, సంస్కృత భాషల అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్



ప్రసంగిస్తున్న చైర్మన్ ఆర్డీ విల్సన్, పాల్గొన్న డొక్కా మాణిక్యవరప్రసాదు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): తెలుగు నుడికారానికి గుడికట్టిన కవి గుర్రం జాషువా అని తెలుగు, సంస్కృత భాషల అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ అన్నారు. గుంటూరు శారదానికేతన్‌లో గురువారం జాషువా కల్చరల్ సెంటర్ గౌరవాధ్యక్షుడు ఎస్.బాలస్వామి అధ్యక్షతన జాషువా జయంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథి విల్సన్ మాట్లాడుతూ సాహితి లోకంలో విరాజిల్లిన కవిగా జాషువా వెలుగొందాడని కొనియాడారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నంత వరకు జాషువా కవిత్వం వర్ధిల్లుతుందన్నారు. అనంతరం ప్రముఖ సాహితివేత్తలు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, చిటిపోలు వెంకటరత్నంను జాషువా పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు పోలే ముత్యం, పీవీ రమణ, బీరం సుందరరావు, డాక్టర్ ఎం.విజయశ్రీ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోటిరత్నం, కరస్పాండెంట్ టి.శ్రీనివాసరావు, న్యాయవాది రవీంద్రబాబు, మోహనరావు, కె.లెనినా, జె.బాబురావు, చంద్రపాల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు ప్రభుత్వం శుభవార్త

● ఎక్కడైనా పంట అమ్ముకునే అవకాశం

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పత్తి సాగు చేసిన రైతులకు ప్రభుత్వం శుభావార్త చెప్పింది. పత్తి పంటను ఇష్టమైన కొనుగోలు కేంద్రంలో అమ్ముకునే వెసులు బాటు కల్పిస్తూ జీఓ జారీ చేసింది. ఇప్పటి వరకు రైతులు పండించిన పత్తిని అదే మండలంలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో మాత్రమే విక్రాయించాల్సి వచ్చేది. దాని వల్ల సరైన ధర దక్కడం లేదని రైతులు ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని పరిశీలించిన ప్రభుత్వం గత నిబంధనలను సవరించింది.

కాల్వలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య

బాపట్లరూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాల్వలోకి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా అతని మృతదేహం గురువారం సూర్యలంక పొగరు వద్ద లభ్యమైంది. బాపట్ల రూరల్ పోలీసులు వివరాల మేరకు.. బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామానికి చెందిన వీరభద్రరావు (62) అనే వ్యక్తి కిరణా కొట్టు నడుపుకుంటూ ఒంటరిగా జీవితం సాగిస్తున్నాడు. మానసికంగా కృంగిపోయిన వీరభద్రరావు మూడు రోజుల క్రితం నాగరాజు కాల్వలో దూకాడు. అతని మృతదేహాన్ని సూర్యలంక పొగుర వద్ద మత్స్యకారులు చూసి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు మృతదేహన్ని తరలించి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం


ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం విగ్రహానికి నివాళులర్పించిన గాయకులు, సేవా సదన్ సభ్యులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు, తెలుగు పాటలకు చిరునామా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యమని పలువురు ప్రముఖులు కొనియాడారు. గురువారం కళా దర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు సౌజన్యంతో, సేవా సదన్ అధ్యక్షుడు మిరియాల గోపికుమార్ ఆధ్వర్యంలో స్థానిక నాజ్ సెంటర్, ఐలాండ్ వద్ద ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నంత కాలం బాలు పాట వినపడుతూనే ఉంటుందన్నారు. గాయకులు యశోదకృష్ణ, వెంకటరత్నం, డేగల వెంకటేశ్వరరావు, ఖాదర్, బాబురావు, ఎన్ కోటేశ్వరరావు, కృపావరం, ఉపేందర్‌సింగ్, సత్తార్, మాతృశ్రీ విద్యా సంస్థల డైరెక్టర్ గాంధీ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుకి ఉచిత శిక్షణ

తాడేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో శాప్ ఎస్‌డీలో ఉచిత సాఫ్ట్‌వేర్ కోర్సులో శిక్షణ అక్టోబర్ 25 ప్రారంభమవుతుందని సంస్థ వ్యవస్థాకుడు వంగర సురేష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని డిగ్రీ విద్యార్థులకు ఈ శిక్షణ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. 11వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమంపై.. వివరాలకు 99852 22857, 94402 64695 నంబర్లకు సంప్రదించాలన్నారు. లేదా కుంచనపల్లి బైపాస్ రోడ్డు వద్ద డీ మార్ట్ పక్కన ఉన్న రామ్‌స్నేహ అవెన్యూస్ ఫ్లాట్ నంబరు 208లోని సంస్థ కార్యాలయంలో సంప్రదించవచ్చని సురేష్‌కుమార్ తెలిపారు.

జగన్‌ది దగా.. చంద్రబాబు మెగా

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జగన్‌మోహన్‌రెడ్డి దగా డీఎస్సీతో నిరుద్యోగుల్ని వంచిస్తే, చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీతో వారి కలలు నిజం చేశారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం అన్నారు. ఏటా మెగా డీఎస్సీ అమలు చేస్తానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లూ అధికారంలో ఉండి దగా డీఎస్సీ అమలు చేశాడన్నారు. రాష్ట్ర యువతను వంచించి, వారి కలలను భగ్నం చేశారని మండిపడ్డారు. సీపీఎస్, పీఆర్సీ అమలుపై తనను ప్రశ్నించారన్న అక్కసుతో జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధ్యాయులపై కక్షగట్టి వారితో చేయకూడని పనులు చేయించారన్నారు. తనకు వ్యతిరేకంగా పనిచేస్తారన్న దురుద్దేశంతో చివరకు ఎన్నికల విధుల నుంచి తప్పించడానికి కుట్రలు పన్నారని విమర్శించారు. టీడీపీ అంటే డీఎస్సీ, డీఎస్సీ అంటే టీడీపీ అని మరోసారి నిరూపితం అయిందన్నారు. 2014-19లో 18 వేల పోస్టులతో డీఎస్సీ అమలు చేస్తే.. నేడు 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీకి కూటమి కార్యరూపమిచ్చిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పట్టుదల, పక్కా ప్రణాలికతో వైసీపీ ప్రభుత్వానికి సాధ్యంకాని మెగా డీఎస్సీ అమలు ఆచరణ సాధ్యమైందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	120, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

32,470 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 30,729 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 32,470 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,696 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12000
334	10500	14200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14000	334	10500	14400
273	10500	13500	నెంబరు. 5	10000	14200
341	10000	15000	273	----	----
4884	----	----	341	10000	15200
సూపర్ 10	----	---	4884	10000	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14500	తేజ	10000	14700
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15000
బ్యాడిగి	10000	14800	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7000

రేపు జాబ్‌మేళా

మాచర్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 27వ తేదీన డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యాన ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీకుమారి తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 7842747682, 9492158153లను సంప్రదించాలన్నారు.

సంక్షిప్తం...

● కారంపూడి: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని గురువారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ దంపతులు దర్శించుకున్నారు. తహసీల్దార్ దంపతులను ఆలయ కమిటీసభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● కారంపూడి: స్థానిక సత్యసాయి షిర్డీసాయి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం ఆలయ కమిటీసభ్యులు నగరసంకీర్తన గావించారు. కార్యక్రమంలో తుమ్మేపల్లి నాగేశ్వరరావు, వెచ్చా వరలక్ష్మణరావు పాల్గొన్నారు.

● రాజుపాలెం: మంచినీటి కోసం ఇబ్బంది పడుతున్నామని రాజుపాలెం పులిచింతల పునరావాసకేంద్రానికి చెందిన కూటమి నాయకులు, ప్రజలు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో గురువారం మండల పరిషత్ నిధులతో రాజుపాలెం ఆర్‌ఆర్ సెంటర్లో రెండుచోట్ల బోర్లు వేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్దింటి శ్రీనివాసరావు, మేరుగు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

● గురజాలటౌన్: గురజాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ 12వ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి ఆధ్వర్యాన పోషణ్‌మహ్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● అచ్చంపేట: శారీరానికి వ్యాయామం లేకపోవటం, జంక్ ఫుడ్, నూనెతో వండిన ఆహారాలు తినటంవల్ల ఊబకాయం వస్తుందని హెల్త్ ఎడ్యుకేటర్ కే పార్వతి అన్నారు. గురువారం మండలంలోని పెదపాలెంలో 8వ రాష్ట్రీయ పోషణమాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, ఎంఎల్‌హెచ్‌పీ శివనాగమణి, ఏఎన్ఎం సుశీల, సర్పంచ్ హరిబాబు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి: స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్లను శుభ్రం చేశారు. ప్రజలు కూడా వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

క్రీడలకు ప్రాధాన్యమిస్తున్న కూటమి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక క్రీడలకు ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సీఎం చంద్రబాబు క్రీడాకారులకు ఉద్యోగావకాశాల్లో తగిన ప్రోత్సాహం కల్పిస్తున్నట్టు చెప్పారు. గురువారం నకరికల్లులోని శ్రీవంగా వెంకటరెడ్డి జడ్పీ హైస్కూల్లో 12వ రాష్ట్రస్థాయి అట్యాపాట్యా ఛాంపియన్‌షిప్-25 స్త్రీ, పురుషుల జట్ల ఎంపికకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రీడాకారులు జిల్లాకు, రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. 20 జిల్లాల నుంచి 575మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడాకారులతో గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం జాలాది శ్రీనివాసరావు, దాసరి కోటేశ్వరరావు, ఆర్ చరణ్, ఆర్‌డీ ప్రసాదు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య, ఎస్ఎంసీ చైర్మన్ కాసా మల్లికార్జునరావు, పీడీలు జీ ఝాన్సీరాణి, పుల్లయ్య, ఎన్ జానకిరామయ్య, సాగి శ్రీనివాసరావు, తిరుమలశెట్టి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

● ప్రమాదవశాత్తు మృతిచెందిన గుండ్లపల్లికి చెందిన షేక్ సలాం, షేక్ కొలిమి బడేసాహెబ్, చేజర్లకు చెందిన షేక్ బాషా కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున చెక్కులను ఎమ్మెల్యే కన్నా పంపిణీ చేశారు. కుంకలగుంట గ్రామంలో ఎమ్మెల్యే కన్నా స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

బాజీ చౌదరి త్వరగా కోలుకోవాలి..

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి త్వరగా కోలుకోవాలి ఎమ్మెల్యే కన్నాఆకాంక్షించారు. ఇటీవల స్కూటర్ ప్రమాదంలో బాజీచౌదరి కాలికి గాయమైంది. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం ఆయన కుంకలగుంట వచ్చారు. ఎమ్మెల్యే కన్నా, బాజీచౌదరిని పరామర్శించారు. ఆయనతో పాటు నాగోతు శౌరయ్య, స్థానిక టీడీపీ నేతలు కనుమూరి సాంబశివరావు, రాజేంద్రప్రసాదు, సాగి శ్రీనివాసరావు, వట్టికుంట వెంకట అప్పయ్య, గార్లపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

సత్తెనపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వడ్డవల్లికి చెందిన గంగదారి మేఘన అనారోగ్యంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే కన్నా ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికితీసుకెళ్లారు. సీఎం చిన్నారి మేఘన వైద్యానికి రూ.10లక్షలు మంజూరుచేశారు. గురువారం చెక్కును కుటుంబసభ్యులకు అందించారు.

సాహితీరంగంలో మహా శిఖరం జాషువా

● విశ్రాంత న్యాయమూర్తి కూచిపూడి ప్రసాదరావు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సాహితీ రంగంలో మహా శిఖరం, తన కలాన్ని ఖడ్గంగా చేసుకొని అనేక పోరాటాలు చేసిన కవి చక్రవర్తి గుర్రం జాషువా అని విశ్రాంత న్యాయమూర్తి కూచిపూడి ప్రసాదరావు అన్నారు. కార్ఫ్‌సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాషువా జయంతి సందర్భంగా లెనిన్‌నగర్‌లోని కార్ఫ్ స్కూల్లో జాషువా సాహితీ పురస్కార సభలో ప్రసాదరావు ప్రసంగించారు. ఈ సందర్భంగా పరిశపోగు సునీల్, అనిల్‌డానీ, మందా రాజశేఖర్, మాలపాటి జోజిబాబు, శెట్టిపోగు ఏసురత్నంకు జాషువా సాహితీపురస్కారాలు అందజేశారు.

కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగుల సమ్మె విరమణ

రెంటచింతల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న 59మంది సిబ్బంది గురువారం సమ్మెను విరమించారు.

● టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హామినిచ్చారు. గురువారం తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కార్యదర్శి సుబ్బారావు యాదవ్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి ఈమేరకు హామీనిచ్చారు.

మోడల్ మ్యాజిక్ డ్రెయిన్ స్థలం పరిశీలన

దుర్గి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులేశునిపల్లెలోని ఎస్సీ కాలనీలో నిర్మించనున్న మోడల్ మ్యాజిక్ డ్రెయిన్‌స్థలాన్ని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ జి.సత్యనారాయణ పరిశీలించారు. గురువారం ఆయన దుర్గి వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం వర్షంనీటిని, మురికినీటిని శుద్ధిచేయుటకు మోడల్‌గా మ్యాజిక్ డ్రెయిన్‌ను ప్రతి గ్రామంలో ఏర్పాటుచేయాలని నూతనంగా కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాలని సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. దీనిద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించు కోవాలన్నారు.

శోభాయమానంగా దేవీ నవరాత్రులు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా అన్ని దేవాలయాల్లో దేవీ నవరాత్రులు శోభాయమానంగా జరుగుతున్నాయి. దేవాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. వాసవీ దేవాలయంలో అమ్మవారు పర్వతవర్ధినిగా, కనకదుర్గ ఆలయం, గుత్తికొండబిలంలోని రాజరాజేశ్వరీఅమ్మవారిని కాత్యాయినీదేవిగా, కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నరసింహావతారంలో దర్శనమిచ్చారు.

● దాచేపల్లిలోని అంకమ్మ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో చండీ హోమం, పారాయణం నిర్వహించారు. నారాయణపురంలోని పాత రామాలయంలో బతకమ్మ పూజలు నిర్వహించారు.

● మాచవరం: మండలంలోని చెన్నాయపాలెంలోని రేణుకాఅమ్మవారిని కాత్యాయనీదేవిగా అలంకరించారు. మాచవరంలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో లలిత త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు.

● సత్తెనపల్లి: పట్టణంలోని వెంకటపతి కాలనీ నీలంపాటి లక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మవారు కాత్యాయనిదేవిగా దర్శనమిచ్చారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, వివిధ ప్రాంతాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

● రాజుపాలెం: మండలంలోని రాజుపాలెం, గణపవరం, నెమలిపురి తదితర గ్రామాల్లో దసరా నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. రాజుపాలెంలో శ్రీకాత్యయనిదేవిగా దర్శనమిచ్చారు.

● నకరికల్లు: నరసింగపాడులోని గంగా అన్నపూర్ణాదేవి మహేశ్వరి అలంకారంలో, చేజర్లలో గాయత్రి అలంకారంలో గంగా భ్రమరాంబ పార్వతి అమ్మవారు, అన్నపూర్ణా దేవిగా కుంకలగుంటలో భద్రకాళి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

● మాచర్ల రూరల్: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు గురువారం శ్రీవన దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

● మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని మెయిన్ బజారులో కనకదుర్గమ్మ కాత్యాయనీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

● కారంపూడి: కారంపూడిలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు లలితాదేవిగా, అంకాళమ్మ కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని శుద్ధగుంతల కాలనీ శ్రీకనకదుర్గమ్మని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేకపూజలు జరిపారు.

● రెంటచింతల: సత్రశాలలోని శ్రీభ్రమరాంబ, జంక్షన్‌లోని శ్రీకనకదుర్గ, శ్రీవాసవీ మాత, రామాలయం, తిరుపతమ్మ ఆలయం, శ్రీచౌడేశ్వరీ ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

● అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. కోదండరామాలయం, కన్యకాపరమేశ్వరీ ఆలయం, బాలాత్రిపురసుందరీ ఆలయం, గోపాల్ నగర్‌లో శ్రీకృష్ణుని ఆలయం, లింగాపురంలోని బలుసులమ్మ ఆలయం, పెద్దింటమ్మ ఆలయం, వడియరాజుల కాలనీలో దుర్గాదేవి మండపం వద్ద ఉత్సవాలతో పాటు ప్రత్యేక పూజలు జరిగిగాయి.

● బెల్లంకొండలో మహాలక్ష్మీ అమ్మవారు కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు.

● క్రోసూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతవరం వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

● అచ్చంపేటలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. మాదిపాడు వద్ద శారదాంబ ఆలయంలో అమ్మవారిని మయూరవాహన అలంకారంగా అలంకరించారు.


పిడుగురాళ్ల: కాత్యాయినీ అలంకరణలో గుత్తికొండ బిలంలోని అమ్మవారు


దాచేపల్లిలో అన్నపూర్ణాదేవి అలంకారం


మాచర్లలో వనదుర్గాదేవిగా శ్రీవాసవీ అమ్మవారు


విజయపురిసౌత్‌లో కాత్యాయినీ అలంకరణలో కనకదుర్గమ్మ..


అమరావతిలో అన్నపూర్ణ దేవిగా బాలచాముండికా అమ్మవారు


సత్తెనపల్లిలో కాత్యాయినీదేవిగా అమ్మవారు..


మాచవరం: చెన్నాయపాలెంలో కాత్యాయినీదేవిగా రేణుకా అమ్మవారు

భవిష్యత్తు తరాలకు ఉజ్వల మార్గాన్ని చూపాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ తరాలకు ఉజ్వల మార్గాన్ని చూపుతూ విద్యతో సమాజాన్ని అభివృద్ధి దిశగా నడి పించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడు నియోజక వర్గంలో 76మంది అభ్యర్థులు డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులకు ఎంపికైన వారికి గురువారం నియామక పత్రాలను అందించారు. విద్యారంగంలో మరింత ముందుకు సాగేందుకు నూతన ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

● కమిషనర్ శివన్నారాయణ

గురజాలటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం అందుతుందని, ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గురజాల కమిషనర్ శివన్నారాయణ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని బ్రహ్మనాయుడు సెంటర్ నుంచి హైస్కూల్ వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్యంపై ప్రజలు దృష్టి పెట్టాలని, చెత్త బుట్టలను వినియోగించాలన్నారు. బ్రహ్మనాయుడు సెంటర్ నుంచి హైస్కూల్ వరకు చీపుర్లతో రోడ్లను శుభ్రపరిచారు. అనంతరం ప్రభుత్వ కళాశాల గ్రౌండ్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

● పిడుగురాళ్ల : ప్రతిఒక్కరు ఆరోగ్యవంతమైన జీవితం గడిపేందుకు పరిసరాలు శుభ్రంగా వుంచుకోవాలని కమిషనర్ ఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం పట్టణంలోని వాకింగ్ ట్రాక్ వద్ద ఏక్‌దిన్.. ఏక్‌గంట.. ఏక్‌సాత్ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ఐ శ్రీనివాసులు, కూటమి నేతలు ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటి పచ్చదనానికి గల ప్రాధాన్యతను వివరించారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, ఎల్‌వీఆర్, వడ్డవల్లి సాంబశివరావు, బొల్లా శ్రీను, జొన్నల గడ్డ శ్రీను, వల్లెపు రామకృష్ణ, కుంచపు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

● దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని రెండో వార్డులో ఉన్న హిందూ శ్మశానవాటిక పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారాన్ని, కంపను తొలగించారు. స్వచ్ఛతను స్వచ్ఛరథం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన కార్యక్రమానికి కూటమినేతలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలందరూ సంఘటితంగా పరిసరాల శుభ్రతపై దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో నర్ర పుల్లయ్య, సొసైటీ నారాయణ, బొమ్మిరెడ్డి నారాయణ, పగడాల భాస్కరరావు, షేక్ అహమ్మద్ షరీఫ్, మాజీ ఎంపీటీసీ వలి, రుద్రల అచ్చారావు, కూరాకుల నాగేశ్వరరావు, షేక్ పెదరాల తదితరులు పాల్గొన్నారు.


మాచర్ల: రోడ్లను ఊడుస్తున్న అధికారులు


పిడుగురాళ్ల: ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు, కూటమి నేతలు

చెత్త రహిత గ్రామాల సాధనలో భాగస్వాములు కావాలి

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): చెత్తరహిత గ్రామాల సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో టీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నందిగామ వద్దగల సుప్రీం ఎల్‌టీసీలో గురువారం అమరావతి, అచ్చంపేట, బొల్లాపల్లి, దాచేపల్లి మండలాల్లో కొత్తగా ఎంపికైన సీఆర్‌పీలకు ఘనవ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం జరిగింది. పల్నాడు జిల్లాలోని మిగిలిన 26 మండలాల సీఆర్‌పీలకు అక్టోబరు 1వ తేదీ వరకు ప్రతిరోజు శిక్షణ ఉంటుందన్నారు. డీఆర్‌పీ నరసింహనాయక్, డిప్యూటీ ఎంపీడీవో రెహ్మాన్, సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, పీఎస్‌లు కుంభా వెంకటేశ్వర్లు, చిలువూరి కృష్ణప్రసాదు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై శిక్షణ

స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ 1.0పై ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులకు గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. శిక్షణలో డీఎల్‌డీవో రాజగోపాల్ మాట్లాడుతూ అధికారులంతా తమ లాగిన్‌లోకి వచ్చిన డేటాను పార్వార్డ్ చేయాలన్నారు. ట్రైనర్లు రెహ్మాన్, కృష్ణప్రసాదులు పంచాయత్ అడ్వాన్స్ ఇండెక్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో టీ శ్రీనివాసరావు, ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ విజయసుందర్ దాసు తదితరులు పాల్గొన్నారు.

జానపాడులో ఫీవర్ సర్వే

● ఇంటింటిని సందర్శించిన వైద్యసిబ్బంది

పిడుగురాళ్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో వైరల్ ఫీవర్స్ ఎక్కువగా ఉన్నాయని, వైద్య శిబిరాలు, గృహ సందర్శన ద్వారా జ్వర పీడితులను గుర్తించి తగిన చికిత్స అందించేలా చూడాలని రెండురోజుల క్రితం గురజాల ఎమ్మెల్యే యరపతినేని అసెంబ్లీలో ప్రస్తావించారు. దీనిపై స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పలుగ్రామాల్లో గృహ సందర్శన చేసి జ్వరపీడితులను గుర్తించే పనిలో ఉన్నారు. బుధవారం డీఎంఅండ్‌హెచ్‌వో రవి గురజాల, పిడుగురాళ్ల మండలాల్లోని పీహెచ్‌సీలను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. పాతగణేశునిపాడు, జానపాడు గ్రామాల్లో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది ప్రతి గృహాన్ని సందర్శించి జ్వరపీడితులను గుర్తించే పనిలో ఉన్నారు. స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది గుత్తికొండ, పందిటివారిపాలెం, తుమ్మలచెరువు గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించి చికిత్సలు అందజేస్తున్నారు.


జానపాడులో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శన

క్రోసూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): క్రోసూరులో ప్రదర్శించిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారి సంఘం శరణం గచ్ఛామి నాటకం అంబేద్కర్ ఆవేదనకు అద్దంపట్టింది. క్రోసూరులోని షాదీఖానాలో 770వ ప్రదర్శనగా ఈ నాటకాన్ని ప్రదర్శించారు. అంబేద్కర్ పాత్రలో ఆయన ఆవేదన ఆలోచింపచేసింది. పెద్దపెద్ద విగ్రహాలు పెట్టడం, తనను ఒక వర్గానికే పరిమితం చేయటం ఆవేదన కలిగిస్తుందన్నారు. అహర్నిశలు దేశం కోసం పరితపిస్తే తన జీవిత చరమాంకంలోని రెండు అంశాలు రాజ్యాంగ రచన, రిజర్వేషన్‌లను రాజకీయాల కోసం నేటితరం నాయకులు ఉపయోగించుకోవటం తనను కలచి వేస్తుందని చెప్పిన తీరు ఆలోచింపచేసింది. ప్రభుత్వ ఉద్యోగాల్లోనే పేదలకు అవకాశం కల్పించటం శోచనీయమని, ప్రైవేట్‌రంగంలో కూడా నిమ్న జాతి వారికి, మేధావులకు అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. నాటక ప్రదర్శనను క్రోసూరుకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సహకారంతో వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యం వహించి ప్రదర్శించారు. నాటక ప్రదర్శనకు హాజరైన ప్రేక్షకులు మంత్రముగ్ధులై తిలకించారు.


సంగం, శరణం గచ్ఛామి నాటక ప్రదర్శనలోని దృశ్యం

చలమయ్యకు నివాళులర్పించిన ఎమ్మెల్యేలు

విజయపురిసౌత్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అదనపు ఈవో చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి తండ్రి చలమయ్య అనారోగ్యంతో మృతిచెందడంతో గురువారం పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. స్వగ్రామమైన మాచర్ల మండలం బెల్లంకొండవారిపాలెంలో చలమయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ బెల్లంకొండ వారిపాలెం గ్రామానికి చలమయ్య చేసిన సేవలను మరువలేనివని, ఆయన లేని లోటు పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. వెంకయ్యచౌదరితో పాటు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దెందులూరి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి, ఒట్టికొండ రంగనాయకులు, కజ్జం సైదయ్య, వంగులూరి పుల్లయ్య, అంజయ్య, యెనుముల కేశవరెడ్డి, గుండు కృష్ణమూర్తి, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, గుండాల శ్రీను, నేరేటి వీరాస్వామి యాదవ్, చిరుమామిళ్ల కృష్ణయ్య, గోపిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, డాక్టర్ గాడిపర్తి అచ్చయ్య, బెల్లంకొండ బంగారయ్య, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, గంటా ధనుంజయ్, కొశ్లూరి వెంకట్రామయ్య, గొట్టిముక్కల బాబు తదితరులు పాల్గొన్నారు.


చలమయ్య కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు

బాలకృష్ణను కలిసిన ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణను గురువారం అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కలిశారు. పల్నాడు జిల్లాలో, పల్నాడులో టీడీపీ పరిస్థితి బాగుందని, కార్యకర్తలను వెన్నంటి కాపాడుకునే మంచికల్లు శ్రీనన్నగా నీకున్న పేరు ఎందరి నోటివెంటో విన్నానని బాలకృష్ణ ఎమ్మెల్యే యరపతినేనికి కితాబిచ్చారు. యరపతినేని తనయుడు నిఖిల్ కూడా వున్నారు.


అసెంబ్లీ ఆవరణలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను కలిసిన ఎమ్మెల్యే యరపతినేని, తనయుడు నిఖిల్

ఏక్ దిన్ - ఏక్ గంట - ఏక్ సాత్..

మాచర్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాచర్ల పురపాలక సంఘం ఆధ్వర్యాన గురువారం ఏక్ దిన్-ఏక్ గంట-ఏక్ సాత్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల పరిసరాలను శుభ్రపరిచారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మదార్‌సాహెబ్, కమిషనర్ డి.వేణుబాబు, కౌన్సిలర్ సుభానిసాహెబ్, డాక్టర్ చారి, రోటరీ క్లబ్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న మున్సిపల్ సిబ్బంది, రోటరీ క్లబ్ సభ్యులు

ముఖ హాజరు తప్పనిసరి

సత్తెనపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వచ్చే అధ్యాపకులు, సిబ్బంది తప్పనిసరిగా ముఖ హాజరు వేయాలని ఇంటర్మీడియట్ బోర్డు ఆర్‌జేడీ పద్మ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌తో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరు సమయ పాలన పాటించాలన్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థలో పలు మార్పులు, సంస్కరణలు తీసుకువచ్చిందని, కార్పొరేట్ సంస్థలకు ఏ మాత్రం తీసిపోకుండా నాణ్యమైన విద్యను అందించేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఆరు నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థుల కోసం విద్యా శక్తి పథకాన్ని తీసుకు వచ్చిందన్నారు. ఆమెతో పాటు పల్నాడు జిల్లా ఇంటర్ బోర్డు అధికారి నీలావతి, ప్రిన్సి పాల్ కే పద్మావతి తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు ఆర్‌జేడీ పద్మ

పంచాయతీ స్థలం ఆక్రమణ

రాజుపాలెం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పంచాయతీ స్థలం ఆక్రమణకు గురవుతున్నా తమకేమి సంబంధం లేదన్నట్లుగా సదరు అధికారులు వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తుంది. రాజుపాలెం గ్రామంలోకి వెళ్లే రహదారికి ఉత్తరం రైల్వేగేటు దక్షిణం నేషనల్ హైవే రహదారి. మధ్యలో ఉన్న కాస్త రహదారికి పడమర దిక్కున ఉన్న పంచాయతీ స్థలాన్ని గతంలో ఆక్రమించుకుని గదులు కట్టించి అద్దెకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. రహదారికి తూర్పు వైపున ఉన్న పంచాయతీ స్థలాన్ని కూడా ఆక్రమించుకునేందుకు సిద్ధమయ్యారు. వారిలో ఒకరు షాపును రాత్రికి రాత్రి తెచ్చి పంచాయతీ స్థలంలో పెట్టారు. ఉన్న కొద్దిపాటి పంచాయతీ స్థలం ఆక్రమణతో గేటు వేసిన సమయంలో గేదెలు, మేకలు, ఎడ్ల బండ్లు, ప్రజలు ఇబ్బంది పడతారని ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శికి కూటమి నాయకులు తోట సుభాష్, వాసా నాగేశ్వరరావు తదితరులు ఫిర్యాదుచేశారు. మరికొంతమంది పంచాయతీ స్థలంలో గతంలో నిర్మించినవి కూడా తీసివేయాలని డిమాండ్ చేస్తూ అధికారులకు విన్నవించారు.

అమరేశ్వరాలయంలో అన్నదానానికి లక్ష విరాళం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి గుంటూరుకు చెందిన భక్తుడు చతురవేదుల శ్రీనివాస శాస్త్రి లక్ష రూపాయల చెక్కును గురువారం ఈవో రేఖకు అందజేశారు.


చెక్కును ఈవోకి అందజేస్తున్న శ్రీనివాస శాస్త్రి

‘స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్’లో భాగస్వాములు కావాలి

● మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య

క్రోసూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్రా, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య, క్రోసూరు ఎంపీడీవో జీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం క్రోసూరులోని ప్రధానవీధిలో అధికారులు, నాయకులు చీపుర్లతో రోడ్లను శుభ్రం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత పరిశుభ్రత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో సీఎం ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనుముల వెంకటరామిరెడ్డి, పీఎస్ ఆదినారాయణ, అధికారులు పాల్గొన్నారు.

పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ జయంతి

మాచర్ల రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం బీజేపీ జిల్లా కార్యదర్శి గంజర్ల ఆదిలక్ష్మి ఆధ్వర్యాన పండిట్ దీ నదయాల్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దర్శికుమార్, గొబ్బూరి శ్రీనివాసరావు, టి.రాణి, డి.లక్ష్మమ్మ, జి.దేవి, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రంగమ్మ మృతికి పలువురి నివాళి

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు మంచినేని రాజా మా తృమూర్తి రంగమ్మ మృతిచెందడంతో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ వేర్వేరుగా దిడుగు గ్రామానికి వెళ్లి రంగమ్మ మృతదేహానికి నివాళులర్పించి రాజాకు తమ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు సంతాపం తెలియజేశారు.

మహాలక్ష్మమ్మకి నివాళి

సత్తెనపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరంనకు చెందిన టీడీపీ నేత మేకల శ్రీనివాసరావు సతీమణి మహాలక్ష్మమ్మ దశదిన కర్మలో మాజీ ఎమ్మెల్యే పుతుంబాక భారతి, మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, పలువురు టీడీపీ నేతలు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారితోపాటు టీడీపీ యువ నేత మన్నెం శివనాగమల్లేశ్వరరావు, సయ్యద్ పెద కరీ ముల్లా, తొరటి వెంకటరావు తదితరులున్నారు.

మహాచైత్య ప్రాంగణంలో స్వచ్ఛతా హి సేవా

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర పురావస్తుశాఖ పరిధిలోని మహాచైత్యం వద్ద స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని మండల పరిషత్ అధికారులు నిర్వహించారు. ప్రత్యేకాధికారి రాజగోపాల్, ఎంపీడీవో టి.పార్వతి, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది మహాచైత్యం పరిసరాలను శుభ్రం చేశారు. ముందుగా లేమల్లెలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఎం హనుమంతరావు, సర్పంచ్ ఉగ్గం పున్నమ్మ మండల అధికారులు పారిశుధ్య కార్యక్రమం చేపట్టి సిబ్బందిని సన్మానించారు.


మహాచైత్య ప్రాంగణంలో స్వచ్ఛతా హి సేవా కార్య క్రమంలో అధికారులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

జాతీయ రహదారిపై ప్రమాదం... ఒకరికి గాయాలు

యడ్లపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పదహారో నంబరు జాతీయరహదారిపై యడ్లపాడు మండలం వంకాయలపాడు పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన కొర్రపాటి కోటయ్య గురువారం ఉదయం చిలకలూరిపేట వెళ్లి గ్రామానికి తిరిగి వస్తుండగా యడ్లపాడు మండలం వంకాయలపాడు వద్ద వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. దీనితో కోటయ్యకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయపడిన కోటయ్యను కొండ్రుపాడులోని కాటూరి హాస్పటల్‌కు తరలించారు.

రూ. 20 లక్షలతో పార్కు అభివృద్ధి

చిలకలూరిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ కాలనీలో నిరుపయోగంగా ఉన్న బింగీ రామమూర్తి పార్కును రూ. 20 లక్షలతో అభివృద్ధి చేయనున్నట్టు మునిసిపల్ ఛైర్మన్ షేక్ రఫాని గురువారం తెలిపారు. కాలనీలో జరిగిన కార్యక్రమానికి హాజరైన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన త్వరలోనే టెండర్లు పిలిచి పార్కు పనులను చేపడతామని చెప్పారు.

నిరుద్యోగ యువత కలల సాకారం

చిలకలూరిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగులకు పండుగ వచ్చిందని, మెగా డీఎస్సీతో నిరుద్యోగ యువత కలల సాకారం జరిగిందని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

అర్హులైన కౌలు రైతులందరికీ బ్యాంకు రుణాలు అందించాలి: డీఏవో

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన కౌలు రైతులందరికీ బ్యాంకు రుణాలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు తెలిపారు. నరసరావుపేట మండలంలోని రాయపాడు గ్రామం యూనియన్ బ్యాంక్ అధికారులను కలిశారు. కార్యక్రమంలో నరసరావుపేట వ్యవసాయ సహాయకులు కేవీ శ్రీనివాసరావు, నరసరావుపేట వ్యవసాయ అధికారి ఐ శాంతి, వ్యవసాయ విస్తరణ అధికారి కే బ్రహ్మయ్య, వ్యవసాయ సహాయకులు సుభాని, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

యలమందల (నరసరావుపేట రూరల్), సెప్టెంబరు 25: రోజురోజుకు పెరుగుతున్న నాగరికతను అందిపుచ్చుకుని రైతులందరూ వ్యవసాయానికి నూతన యాంత్రీకరణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు కోరారు. నరసరావుపేట మండలం యలమందలలో రైతు సేవా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అనంతరం గ్రామంలో రైతులకు డ్రోన్ ద్వారా మందు పిచికారి చేయడంపై రైతులకు అవగాహన కలిగించారు.

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రతిష్టాత్మక సంస్థలలో ఇంటర్న్ షిప్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ, ఈసీఈ విద్యార్థులు ప్రతిష్టాత్మక సంస్థలలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు లభించాయని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున గురువారం తెలిపారు. హైదరాబాద్ సైలోర్ టెక్నాలజీ, బెంగుళూరు జేవిడీ సొల్యూషన్స్‌లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు లభించాయన్నారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పరిశ్రమ అకడమిక్ సంబంధాలను బలోపేతం చేయడం కళాశాల ప్రధాన లక్ష్యం అన్నారు. ఇంటర్న్‌షిప్ పొందిన విద్యార్థులను డిప్లమో ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి అభినందించారు.

అంగలూరు చెరువు గండి పూడ్చివేత

ఈపూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలూరు - వనికుంట గ్రామాల మధ్య ఉన్న చెరువుకు ఏర్పడిన గండిని ఎట్టకేలకు గురువారం పూడ్చివేశారు. నీటి సంఘం అధ్యక్షుడు వెంపటి సీతయ్య, వినుకొండ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నర్రా కిషోర్, వనికుంట గ్రామ సర్పంచ్ బచ్చనబోయిన వెంకట సుబ్బయ్య ప్రత్యేక చొరవతో పొక్లెయిన్ సాయంతో గురువారం గండిని పూడ్చివేశారు.

బొల్లాపల్లి ఎంపీడీవోకు సత్కారం

బొల్లాపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన పీ మాధురిని రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు, బొల్లాపల్లి మండల ప్రధాన కార్యదర్శి కడియాల మరిబాబు, ఎంపీడీవోలు కలసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శిఖా కోటేశ్వరరావు, సర్పంచ్ శ్రీనునాయక్, శిఖా రామయ్య, ధూపాటి బాబు, మీసాల గాబ్రేలు, మాసాల జానీ తదితరులు ఉన్నారు.

నేడు బొల్లాపల్లిలో రక్తదాన శిబిరం

బొల్లాపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు బొల్లాపల్లిలో శుక్రవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరగనున్నట్టు తహసీల్దార్ ఏ సుధాకర్ గురువారం తెలిపారు. ఆసక్తి కలిగిన యువకులు ఎవరైనా సరే రక్తదానం చేయవచ్చన్నారు.

పండిట్ దీన్‌దయాల్‌కు ఘన నివాళి

శావల్యాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సిద్ధాంతకర్త పండిట్‌దీన్‌దయాల్ జయంతి వేడుకలను బీజేపీ మండలాధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సహకారంతో బీజేపీ నాయకులు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రావిపూడి రమ్య, సిబ్బంది పాల్గొని 50మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న వైద్యసేవల గురించి వివరించారు. బీజేపీ నేతలు పాటిబండ్ల ఆంజనేయ ప్రసాద్, గుంజ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం శ్రీలత, ఆశాలు పాల్గొన్నారు.





నరసరావుపేట: వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో వైష్ణవి దేవి, బాలయ్యనగర్‌లోని శ్రీకళ్యాణసుందరేశ్వరి స్వామి ఆలయంలో కాత్యాయినీ దేవి అలంకారం



వినుకొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో బత్తాయి కాయలు, యాపిల్ కాయలతో ప్రత్యేక అలంకరణ, శ్రీలక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

జగన్మాత నమోనమః

నరసరావుపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్): నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల్లో దసరా ఉత్సవాలు నేత్ర పర్వంగా జరుగుతున్నాయి. అమ్మవారికి విశేష అలంకరాలు చేస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. సాయంత్రం సమయంలో ఆలయాల వద్ద సాంస్కృతిక, భజన కార్యక్రమాలను ఏర్పాట్లు చేస్తున్నారు.



వినుకొండ: ప్రత్యేక అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి



కోటప్పకొండ భువనేశ్వరిదేవి ఆలయంలో గాయత్రిదేవి అలంకరణలో అమ్మవారు



శావల్యాపురంలో కాత్యాయనిదేవి అలంకరణలో అమ్మవారు




రొంపిచర్ల: అన్నపూర్ణాదేవి అలంకారంలో వాసవి అమ్మవారు, కాత్యాయిని దేవి అలంకారంలో విప్పర్ల కామాక్షమ్మ




నాదెండ్లలో కాత్యాయని అవతారంలో అమ్మవారు, చిన్న సింగర కొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అన్నపూర్ణదేవిగా




లింగంగుంట్ల అయ్యప్పస్వామి ఆలయంలో కూష్మాండదేవిగా, పాలపాడు అయ్యప్పస్వామి ఆలయంలో కౌమారిదేవిగా అమ్మవారు



రక్తదాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీహెచ్ఎస్ జ్ఞాన ప్రసూన

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి: డీసీహెచ్ఎస్ జ్ఞానప్రసూన

ఈపూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రులలోని వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీహెచ్ఎస్ జ్ఞాన ప్రసూన అన్నారు. ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో బాగంగా గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ముందుగా డీసీహెచ్ఎస్ జ్ఞాన ప్రసూన బ్లడ్ డొనేషన్ కేంద్రంను ప్రారంభించారు. ఆసుపత్రి ఆవరణలో అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్యులుహేమలత, దయానిధి, సునీత, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పల్నాడు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, ఈపూరు సొసైటీ ఛైర్మన్ విడపలపాటి హనుమయ్య, చాగంరెడ్డి శ్రీనివాసరెడ్డి, వజ్జా సత్యన్నారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో స్వచ్ఛతా హీ సేవ

వినుకొండ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని స్థానిక ఎస్ఎస్‌పీ కాలనీలోని సాయిబాబా ఆలయ ఆవరణలో మున్సిపల్ శాఖ పర్యవేక్షణలో స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సాయిబాబా గుడి వాకింగ్ ట్రాక్‌లో ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌డీఏ కూటమి నాయకులు మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పెద్దఎత్తున పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్, కౌన్సిలర్లు ఇందుమతి, పోలూరి అంజలి, బీజేపీ సీనియర్ నాయకుడు మేడం రమేష్, టీడీపీ నాయకులు బొంకురి రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

● స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నరగాయపాలెం గ్రామ పంచాయతీలో డిప్యూటీ ఎంపీడీవో సుందరరెడ్డి ఆధ్వర్యంలో ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వజ్రాల నాగిరెడ్డి, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం బి, రమాదేవి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

● శావల్యాపురం: అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలంతా కలసికట్టుగా రోజుకు గంటసేపు శ్రమించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుదామని ఇన్‌చార్జి ఎంపీడీవో పొట్టిపాలెం సుగుణ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి గురువారం శావల్యాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సుగుణ, ఇన్‌చార్జి సర్పంచ్‌లు మద్దినేని ఆంజనేయులు, బీర్నీడి రత్నగిరి, పంచాయతీ కార్యదర్శులు యాకోబు, మహేంద్ర, జ్యోత్స్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, కోఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండలంలోని ముక్కెళ్ళపాడు గ్రామంలో సచివాలయ సిబ్బంది, నాయకులు గురువారం సచివాలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట బాల ప్రసాదు, ఎంపీటీసీ సీహెచ్ రామకృష్ణ, ఎస్ శ్రీనివాసరావు, ఎంపీహెచ్ వీ సురేష్, సచివాలయ సిబ్బంది ప్రభాకర్, గోపీ, ఆషా కార్యకర్త బీ మల్లేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండల కేంద్రం నూజెండ్లలో ఉప్పలపాడు, జెడ్డావారిపాలెం, చెరుకుంపాలెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో సొసైటీ ఛైర్‌పర్సన్ బచ్చు అంజిరెడ్డి, నూజెండ్ల సర్పంచ్ వీర్ల వెంకట స్వామి, టీడీపీ నాయకులు లగడపాటి సూరిబాబు, గంగినేని బ్రహ్మయ్య రొద్దా వీరాంజనేయరెడ్డి, పోపూరి రామయ్య, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో ఆంజనేయ రాజు, స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, పంచాయతీ కార్యదర్శులు రవీంద్రబాబు, రామకృష్ణ, నాగూర్ లాలు పాల్గొన్నారు.



ఎస్ఎస్‌పీ కాలనీలోని సాయిబాబా గుడి ఆవరణను శుభ్రం చేస్తున్న అధికారులు, కూటమి నాయకులు



పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుబ్బరాయగుప్తా తదితరులు

ఘనంగా ఎస్ఎస్ఎన్ కళాశాల ఫ్రెషర్స్ డే

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలోని ఆడిటోరియంలో 2025-26 బ్యాచ్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో కొత్త ఆశయాలు, కొత్త కలలతో అడుగు పెట్టారన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్త మాట్లాడుతూ డిగ్రీ చదువును కేవలం పరీక్షల కోసం మాత్రమేకాకుండా కేరీర్‌ను మెరుగుపర్చుకునే దిశగా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుదీర్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలకు బహుతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాససాయి, డాక్టర్ పీ శ్రీనివాసరావు, డాక్టర్ పీఎన్‌వీడీ మహేష్, డాక్టర్ ఎం.రమేష్, పీ రామాంజనేయరెడ్డి, డాక్టర్ వై.మధుసూదనరావు, వీ ఆనందకుమార్, ఎన్.శ్రీహరి, ఎం.అనిల్‌కుమార్, పీ సదాశివ సత్యనారాయణ, డాక్టర్ ఏ సరళాదేవి, శ్రీలత, డాక్టర్ సదాశివరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ కబడ్డీ జట్టుకు పీఎన్‌సీ, కేఆర్ విద్యార్థి ఎంపిక

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుకు పీఎన్‌సీ అండ్ కేఆర్ విద్యార్థి కే సాయి చంద్రమౌళి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జీ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. ఏఎన్‌యూలో ఈ నెల 23, 24 తేదీలలో నిర్వహించిన అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. ఏఎన్‌యూ జట్టుకు ఎంపికైన కే సాయి చంద్రమౌళిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎం.ప్రేమ్‌చంద్, ట్రెజరర్ డాక్టర్ ఎం.అన్నపూర్ణమ్మ, జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాసప్రసాదు, వైస్ ప్రిన్సిపాల్ బీ రాధాకృష్ణమూర్తి, పీడీ జీ కోటేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



కే సాయి చంద్రమౌళి

ఏఎన్‌యూ అంతర కళాశాలల
కబడ్డీ పోటీలలో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభచాటి బ్రాంజ్ మెడల్ సాధించారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఏఎన్‌యూ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 23, 24 తేదీలలో జరిగిన పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. అదేవిధంగా ఏఎన్‌యూ జట్టుకు కళాశాలకు చెందిన కే నాగసుభాస్‌రెడ్డి, బీ విజయ్‌కుమార్ ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు అక్టోబరు 4 నుంచి 8 వరకు బెలగానిలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీ కర్ణాటకలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థులను పీడీ ఈదర ఆదిబాబు, కోచ్ ఎస్కే మహమ్మద్ తదితరులు అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు



విజేతలతో ప్రిన్సిపాల్ డాక్టర్ పీ ప్రసాదరావు తదితరులు

ఎంఏఎం ఫార్మసీలో వరల్డ్ ఫార్మసిస్ట్స్ డే

నరసరావువపేట టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో గురువారం వరల్డ్ ఫార్మసీ డే 2025 వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పీ ప్రసాదరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం వరల్డ్ ఫార్మసీ డే థీమ్ థింక్ హెల్త్, థింక్ ఫార్మసిస్ట్ అంటే ఆరోగ్యం గురించి ఆలోచించిన ప్రతిసారి మొదట గుర్తుకు రావాల్సింది ఫార్మసిస్ట్ అన్నారు. ఛైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు మాట్లాడుతూ ఫార్మసిస్ట్ అనేవారు సరైన ఔషధ వినియోగంలో, కొత్త ఔషధ పరిశోధనలో, ఆరోగ్య అవగాహన కల్పించడంలో ముఖ్యమైనపాత్ర పోషిస్తారన్నారు. అదే విధంగా విద్యార్థులు పోస్టర్ ప్రెజెంటేషన్‌లో చురుకుగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు నగదు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రాజిని, డాక్టర్ నాగలక్ష్మి, షాలేం రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్‌పై కోర్టులు సుమోటోగా చర్యలు తీసుకోవాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్

చిలకలూరిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సినిమా చూపిస్తానంటూ పరోక్షంగా అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్న జగన్‌పై న్యాయస్థానాలు సుమోటోగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తన దుర్మార్గ పాలనకు బలైన దళితులు, బీసీలు, మైనారిటీల వివరాలు డిజిటల్ బుక్‌లో ఎందుకుస్థానం లేదో జగన్ చెప్పాలని పుల్లారావు ప్రశ్నించారు. డాక్టర్ సుధాకర్ మొదలు కోడికత్తి శ్రీను, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, అనితారాణి, దోమతోటి విక్రమ్, వరప్రసాద్, అబ్దుల్ సలామ్, హాజీరా, చిన్నారి మిస్బాలను బలితీసుకున్న వివరాలు ఏ బుక్ లో భద్రపరిచాడో జగన్ ప్రజలకు చెప్పాలన్నారు. అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడే ధైర్యం లేని జగన్ పారదర్శకంగా పనిచేస్తున్న వ్యవస్థల్ని బ్లాక్ మెయిల్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. తనను గెలిపించిన పులివెందుల ప్రజల బాగోగులు పట్టించకోకుండా డిజిటల్ బుక్‌లు, యాప్‌లు, పిటిషన్ల పేరుతో ప్యాలెస్‌లలో కాలక్షేపం చేస్తున్నాడని, తాను ఆవిష్కరించిన డిజిటల్ బుక్ ద్వారా జగన్ ఏం సందేశం ఇస్తున్నాడో, ఎవరికి సినిమా చూపిస్తాడో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

వెంకయ్య చౌదరికి ప్రత్తిపాటి పరామర్శ



చలమయ్య భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి తండ్రి చిరుమామిళ్ల చలమయ్య భౌతిక కాయానికి స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం నివాళులు అర్పించారు. చలమయ్య స్వగ్రామం బెల్లంకొండవారిపాలెం వెళ్లి వెంకయ్య చౌదరిని పరామర్శించారు. చలమయ్య మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. చలమయ్య భౌతిక కాయం వద్ద నివాళులర్పించి వెంకయ్య చౌదరిని పరామర్శించిన వారిలో ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, రామకృష్ణ, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, భాష్యం ప్రవీణ్, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల రమణ తదితరులు ఉన్నారు.

చేనేతకు చేయూత ఇవ్వాలి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చేనేత రంగానికి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలన్నదే కూటమిప్రభుత్వ లక్ష్యమని, ఏపీ చేనేత ఉత్పత్తులకు 10 జాతీయ అవార్డులు లభించడం రాష్ట్ర నేతన్నల పనితీరుకు నిదర్శనమని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అన్నారు. పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షులు ఏలూరి శశి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను స్థానిక సింగు మినీ ఫంక్షన్ హాల్‌లో గురువారం స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ భారతీయ వస్త్రరంగానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇటీవలే నియోజకవర్గంలోని నేతన్నలకు రూ.95లక్షల విలువైన మగ్గాలు, ఇతర పరికరాలు అందించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం చేతి మగ్గాలకు 200, పవర్ హ్యాండ్లూమ్స్‌పై 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడమేగాక, రూ.5 కోట్లతో త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ కరీముల్లా, మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు శశికుమార్, వల్లూరి జయప్రకాష్, తోట రాజారమేష్, కక్కెర శ్రీనివాసరావు, గట్టా హేమ, ఎం.శివనాగేశ్వరరావు, ఎస్.రంజిత్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీలో శ్రమదానం



శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్న ఛైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు

చిలకలూరిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో పౌరులందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు గురువారం పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ కాలనీలోని మర్రి చెన్నారెడ్డి పార్కు వద్ద జరిగిన శ్రమదానం కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ షేక్ రఫానీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు రోడ్లపైన, కాలువల్లో చెత్త వేయకుండా, మున్సిపాలిటీకి సహకరించి, పారిశుధ్య నిర్వహణను సులభతరం చేయాలన్నారు. సేకరించిన చెత్తను జిందాల్ ఫ్యాక్టరీకి తరలించి అక్కడ విద్యుత్ ఉత్పత్తిలో ఉపయోగిస్తున్నట్టు తెలిపారు.

ఝున్నుసాహెబ్‌కు నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు



ఉపాధ్యాయుడు ఝున్నుసాహెబ్‌కు అవార్డు అందజేస్తున్న శారద ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు

యడ్లపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవీడు పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు షేక్ ఝున్నుసాహెబ్‌కు నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్-2025 అవార్డు లభించింది. విద్యార్థులకు అందంగా రాయడం (కాలిగ్రఫీ)లో ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు వినూత్న బోధనా పద్ధతులతో విద్యాబోధన, వర్క్‌షాపులు నిర్వహించినందుకు గాను ఆయనకు ఈ అవార్డు దక్కింది. హైదరాబాద్‌కు చెందిన శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఏటా వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి ఈ అవార్డును అందజేస్తోంది. గురువారం హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ వారు ఈ అవార్డులను ప్రదానం చేశారు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ పట్నం కమల మనోహర్, తెలంగాణ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎటికాల పురుషోత్తం, ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య, సినీ కళాకారులు తదితరులు ముఖ్యఅతిధులుగా హాజరై అవార్డును అందజేశారు.

హ్యాకథాన్ పోటీలకు ఎన్ఈసీ విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025కు సంబంధించిన నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఇంటర్నల్ హ్యాకథాన్ 2025 సెప్టెంబరు 18 నుంచి 20 వరకు విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. ఈ హ్యాకథాన్ కళాశాలలో వివిధ విభాగాలైన కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్ మెకానికల్, సివిల్ తదితర విభాగాలకు చెందిన 650 మంది విద్యార్థులు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో పాల్గొన్నారని తెలిపారు. ప్రతి కళాశాల నుంచి అత్యున్నత ప్రతిభ కనబర్చిన 50మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికచేసిన వారిని డిసెంబరు నెలలో జరగబోయే 36గంటల నిరంతర కోడింగ్ పోటీలలో పాల్గొనే అవకాశం ఉందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్ బాబు తెలిపారు.